
V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
10-06-2024
సంపుటి : 01 సంచిక : 37 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# మోడీ తీన్మార్

## మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం



- కేంద్ర మంత్రులుగా 72 మంది ప్రమాణస్వీకారం
- అట్టహాసంగా రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరైన దేశాధిపతులు, సినీ, రాజకీయ ప్రముఖులు
- ప్రభుత్వంలో టీడీపీ, జేడీ(యూ)కు పెద్దపీట
- ఎన్డీయేలో మిత్రపక్షాలకు 11 మందికి అవకాశం
- తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు పదవులు
- ఏపీ నుంచి రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, శ్రీనివాస వర్మకు చాన్స్



**విశ్వంభర, ఢిల్లీ:** నరేంద్ర మోడీ మూడోసారి ఢిల్లీ పీఠాన్ని అధిరోహించారు. భారత ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం చేశారు. వరుసగా మూడోసారి ఆయన ప్రధాని అయ్యారు. దీంతో వరుసగా మూడు సార్లు దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండో వ్యక్తిగా నరేంద్ర మోడీ చరిత్ర సృష్టించారు. ఢిల్లీలో ఆదివారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో మంత్రి వర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో మోడీతో పాటు కేంద్రమంత్రులుగా 72 మంది ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి మెజార్టీ సాధించిన ఎన్డీఏ కూటమి.. మరోసారి కేంద్రంలో కొలువుదీరింది. ముఖ్యంగా కేబినెట్ కూర్పులో తెలుగు రాష్ట్రాలకు బీజేపీ అధిష్ఠానం ఈసారి అగ్రపీఠం వేసింది. ఏపీ నుంచి మూడు కేంద్ర మంత్రిపదవులను కట్టబెట్టింది. అదే విధంగా తెలంగాణ నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. మిత్రపక్షాల సమ్మిళితంగా అందరికీ ప్రాధాన్యమిచ్చేలా మోడీ 3.0 టీమ్ రెడీ అయ్యింది.

**కులాల వారీగా పదవులు కేటాయింపు**

ఎన్డీయేలో మిత్రపక్షాలకు 11 మందికి (తరువాయి 2లో)

## తెలంగాణకు కొత్త సీఎస్?



2

- త్వరలో రాష్ట్రంలో భారీ బదిలీలకు చాన్స్
- సీఎస్ రేసులో పలువురి పేర్లు
- రోజుల్లో బదిలీల కసరత్తు పూర్తి చేయాలని ప్లాన్
- జిల్లాలకు కూడా కొత్త సారథులు

## పగ్గాలు ఎవరికి..?



- బీజేపీ జాతీయ అధ్యక్షుడి మార్పు.. ?
- నడ్డాకు కేంద్రమంత్రి పదవి
- త్వరలోనే పదవీ కాలం పూర్తి

2

## మోడీకి థ్యాంక్స్



2

- నిఖార్సైన కార్యకర్తకు మంత్రి పదవి ఇచ్చారు
- వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మాదే అధికారం
- రాజకీయ బలం లేకున్నా 8 సీట్లు గెలిచాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

## తెలంగాణ కాషాయ దళపతికి పట్టం



6

- బండి సంజయ్ కు కేంద్ర మంత్రి పదవి
- కేసీఆర్ సర్కార్ పై అలుపెరగని ఉద్యమాలు
- రాజకీయ జీవిత ప్రస్థానమంతా ఒడిదుడుకులే
- మూడుసార్లు ఎమ్మెల్యేగా ఓటమి

## ఎంపీ ధర్మపురికి ఝలక్!



2

- కేబినెట్ దక్కని అవకాశం
- మంత్రి పదవి దక్కు తుందని ఆశలు
- రాష్ట్రంలో ఇద్దరి పేర్లు చేసిన హైకమాండ్
- ఇంకా మంత్రి రేసులో పలువురు కీలక నేతలు
- మంత్రి విస్తరణ వేళ అవకాశం దక్కేనా



2

## ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను చేస్తాం



2

## 'ప్రైవేటు'ను ఆపేదెవరు..?


ఫీజులు పెంచేసిన స్కూల్స్ యాజమాన్యం

నర్సరీ ఖర్చు రూ.30వేల పైమాటే..

కార్పొరేట్ స్కూల్స్‌లోనే అధికం..







## అక్షర యోధుడికి కన్నీటి వీడ్కోలు

- ముగిసిన రామోజీ రావు అంత్యక్రియలు
- ఎంసీటీ స్మృతివనంలో అంతిమ సంస్కారాలు
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన మంత్రులు తుమ్మల, సీతక్క, జూపల్లి
- రామోజీ పాడె మోసిన ఏపీ సీఎం చంద్రబాబు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు మీడియా రంగ దిగ్గజం, వ్యాపారవేత్త, రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు అంతిమ సంస్కారాలు ముగిశాయి. ఆదివారం రామోజీ ఫిల్మ్ సిటీలో తాను నిర్మించుకున్న స్మృతివనంలోనే రామోజీ రావు ఆఖరి క్రతువు ముగిసింది. ఆయన పెద్ద కుమారుడు, ఈనాడు ఎండీ కిరణ్ రామోజీ రావు చితికి నిప్పు అంటించారు. వెంట మనవడు సుజయ్ కూడా ఉన్నారు. రామోజీ రావు భార్య, కోడళ్లు శైలజా కిరణ్, విజయేశ్వరి సహా మనవడు సుజయ్, మనవరాళ్లు సహరి, బృహతి, దివిజ ఇతర కుటుంబ సభ్యులు కన్నీటితో రామోజీరావుకు వీడ్కోలు పలికారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

రామోజీ అంత్యక్రియల సమయంలో పోలీసులు గౌరవవందనంగా గాల్లోకి కాల్పులు జరిపారు. రామోజీ గ్రూపు ఉద్యోగులు, అభిమానులు జోహార్ రామోజీరావు.. జోహార్ రామోజీ రావు అంటూ (తరువాయి 2లో)

విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం

# 'ప్రైవేటు'ను ఆపేదెవరు..?

- ఫీజులు పెంచేసిన స్కూల్స్ యాజమాన్యం
- నర్సరీ ఖర్చు రూ.30వేల పైమాటే..
- కార్పొరేట్ స్కూల్స్‌లోనే అధికం..
- మూతపడ్డ లోకల్ పాఠశాలలు..
- ప్రభుత్వ స్కూల్స్ డాటా ప్రైవేటుకు..
- పట్టించుకోని అధికార యంత్రాంగం

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** గతంలో కరోనా దెబ్బకు ఓవైపు లోకల్ ప్రైవేటు స్కూల్స్ మూతపడ్డాయి. మరోవైపు మాత్రం ఇదే అదునుగా కార్పొరేట్ స్కూల్స్ ఇబ్బడిముబ్బడిగా ఫీజులను పెంచేశాయి. ఒక్క నర్సరీకే రూ.30వేలకు పైగా వసూలు చేస్తుండడం గమనార్హం. నిజానికి కరోనా నేపథ్యంలో గత మూడేండ్లుగా తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేశారు. కానీ పిల్లలకు ఆస్తిపాస్తులు సంపాదించి పెట్టడం కంటే.. మంచి విద్యను అందిస్తే చాలనే తల్లిదండ్రుల ఆలోచనను ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం క్యాష్ చేసుకుంటోంది. ఇదే సమయంలో స్థానికంగా ప్రభుత్వ స్కూల్స్‌లో చదివే విద్యార్థుల పూర్తి డాటాను ప్రైవేటు స్కూల్స్ అడ్డ దారిన సంపాదించాయి. ఆ డాటాతో విద్యార్థుల ఇండ్లకు వెళ్లి.. తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి.. ప్రైవేటు స్కూల్స్ వైపు మళ్లించడంలో సఫలీకృతమయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రైవేటు స్కూల్స్ దోపిడీని అడ్డుకునేందుకు విద్యాశాఖ యంత్రాంగం ఏ ప్రయత్నమూ చేయకపోవడం గమనార్హం.

**నర్సరీకే రూ.30వేలు వసూలు..**

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో కార్పొరేట్ స్కూల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. వాస్తవానికి కరోనా దెబ్బకు లోకల్ ప్రైవేటు స్కూల్స్ దెబ్బతిన్నయనడంలో ఏలాంటి సందేహం లేదు. యాజమాన్యాల కంటే అందులో పనిచేసే ఉపాధ్యాయుల జీవితాలు రోడ్డున పడ్డాయి. కానీ ఏండ్ల తరబడి రూ.కోట్లు వెనకేసిన యాజమన్యాలు ఉపాధ్యాయులను నిర్మశంగా తొలగించాయి. ఇదే అదునుగా కార్పొరేట్ స్కూల్స్ రకరకాల కారణాలు చెబుతూ.. ఫీజును 20 నుంచి 30 శాతం పెంచేశాయి. నర్సరీకే ప్రైవేటు స్కూల్స్ రూ.30వేలు వసూలు చేస్తున్నాయి. బుక్స్, స్కూల్ డ్రెస్, షూస్, స్కూల్ వ్యాన్ ఫీజు అదనమే. కార్పొరేట్ సంస్థలు ఏకంగా ఒక్కో ప్రాంతంలో రెండు మూడు బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడం గమనార్హం.

**ప్రభుత్వ స్కూల్స్ డాటా.. ప్రైవేటుకు..**

కరోనా దెబ్బకు లోకల్ ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా ఫీజులకు తట్టుకోలేక.. ప్రభుత్వ బడుల్లో చేరారు. గత మూడేండ్ల కాలంలో విద్యావ్యవస్థ ఆగమాగం కావడంతో ప్రైవేటు స్కూల్స్‌కు పంపాలని ఉన్నా.. తల్లిదండ్రులు ఆ సహసం చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ బడుల్లోని విద్యార్థుల డాటాను.. కొంతమంది ప్రభుత్వ హెచ్ఎంల సాయంతో తీసుకున్నాయి. ఆ డాటా ఆధారంగా విద్యార్థుల ఇండ్లకు నేరుగా వెళ్లి మాయమాటలు చెప్పి.. తమ స్కూల్స్ వైపు మళ్లీంచారు. దీంతో ప్రభుత్వ బడుల్లో ఈసారి భారీగా విద్యార్థుల సంఖ్య తగ్గింది. కొంతమంది ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో బడిబాట కార్యక్రమాలు చేపట్టినా.. తల్లిదండ్రుల నుంచి ఆ స్థాయిలో ఆదరణ లేకపోవడం గమనార్హం.




**మూతపడ్డ లోకల్ స్కూల్స్..**

కరోనా దెబ్బకు లోకల్ ప్రైవేటు స్కూల్స్ భారీగా మూతపడ్డాయి. నిజానికి ఈ ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజులు భరించగలిగే స్థితిలో ఉండేవి. కానీ కరోనా వల్ల బడులు తెరుచుకోక.. ఫీజులు వసూలు కాక.. నష్టాల ఊబిలో చిక్కుకుపోయారు. కొంతమంది లోకల్ యాజమాన్యాలు అప్పులు చేసి ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించారు. అయినా పరిస్థితి సద్దుమణగకపోవడం.. ప్రభుత్వం నుంచి చేయూత లేకపోవడం లోకల్ ప్రైవేటు స్కూల్స్ మూతపడ్డాయి. కరోనా ముగిసిపోయినా ఆ తాలుకూ నష్టాలతో ప్రస్తుతం బడులు తెరవలేకపోయారు. ఇదిలావుంటే.. కార్పొరేట్ స్కూల్స్ ఫీజుల మాయపై విద్యాశాఖ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దీంతో ఆ స్కూల్స్ యాజమాన్యాల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి.. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల పెంపుపై పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.

## తెలంగాణకు కొత్త సీఎస్?

- త్వరలో రాష్ట్రంలో భారీ బదిలీలకు చాన్స్
- సీఎస్ రేసులో పలువురి పేర్లు
- రోజుల్లో బదిలీల కసరత్తు పూర్తి చేయాలని ప్లాన్
- జిల్లాలకు కూడా కొత్త సారథులు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణకు కొత్త సీఎస్ (ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి) రానున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎన్నికల కోడ్ ముగిసిన తరుణంలో రాష్ట్రానికి కొత్త సీఎస్ నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు చేసేందుకు సర్కార్ రెడీ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీల వరకు పెద్ద సంఖ్యలో అధికారులను బదిలీ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. మరో వారం పది రోజుల్లో బదిలీల కసరత్తు పూర్తి చేసి ఉత్తర్వులను జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం.

**సీఎస్ రేసులో పలువురి పేర్లు!**

ప్రస్తుత సీఎస్ శాంతికుమారి స్థానంలో కొత్త సీఎస్ పదవి రేసులో పలువురు ఐఏఎస్ అధికారులు ఉన్నారు. అందులో శశాంక్ గోయల్, కె. రామకృష్ణారావు, అరవింద్‌కుమార్, జయేశ్ రంజన్, సంజయ్‌జాజు, వికాస్‌రాజ్‌లు సీఎస్ రేస్‌లో ఉన్నట్లు చర్చ జరుగుతుంది. అయితే శశాంక్ గోయల్‌కు రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగా రామకృష్ణారావు, అరవింద్‌కుమార్‌కు ఏడాది ఉంది. అలాగే జయేశ్ రంజన్, వికాస్‌రాజ్‌కు మూడేళ్లు, సంజయ్ జాజుకు ఇంకా 4 ఏళ్ల పదవి కాలం ఉంది. ఇందులో శశాంక్ గోయల్, కె.రామకృష్ణారావు, వికాస్‌రాజ్ పేర్లను ప్రభుత్వం సీఎస్ పదవికి పరిశీలించే అవకాశాలున్నాయి. సీఎస్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు కూడా బదిలీ అయ్యే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

**జిల్లాలకు కూడా కొత్త కలెక్టర్లు!**

మరోవైపు సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసే అవకాశం ఉంది. కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ స్థాయి అధికారులను వారం రోజుల్లో బదిలీ చేసే అవకాశం ఉంది. ఈ బదిలీలు జరుగుతున్న తరుణంలో కొందరు అధికారులు ముఖ్యమైన జిల్లాల్లో పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేసుకుంటున్నట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీల బదిలీలపై ఇప్పటి వరకు ఎన్నికల సంఘం ఆంక్షలు కొనసాగాయి. ఇదే జరిగితే జిల్లాలకు కొత్త సారథులు రానున్నారు.

## ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను చేస్తాం

- ఐటీ, పరిశ్రమల అభివృద్ధి కోసం ఆవిష్కరణలు
- గ్రామీణ ప్రాంతాల్లో కూడా పారిశ్రామికాభివృద్ధి
- ఆటా బిజినెస్ సెమినార్‌లో మంత్రి శ్రీధర్ బాబు

**విశ్వంభర, అట్లాంటా:** హైదరాబాద్ను ఏఐ రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమల అభివృద్ధి కోసం ఆవిష్కరణలను ప్రోత్సహించి, శ్రామిక శక్తి నైపుణ్యాలను పెంపొందించే విధానం ద్వారా ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. అమెరికాలోని అట్లాంటాలో జరిగిన ఆటా బిజినెస్ సెమినార్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. పెద్ద పరిశ్రమలకే పరిమితం కాకుండా మధ్య, చిన్న తరహా పరిశ్రమలను ఆహ్వానించటం ద్వారా వృద్ధిని సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి విద్య, ఆరోగ్య మౌలిక సదుపాయాలకు సంబంధించిన మెరుగైన ప్రభుత్వ విధానాలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పారిశ్రామికాభివృద్ధిని సాధించేందుకు వ్యాపార వేత్తలను ఆహ్వానిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 2024లో జరిగే గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు అమెరికన్ ఇండియన్ దయాస్పోర్ను ఆహ్వానిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## పగ్గాలు ఎవరికి..?

- బీజేపీ జాతీయ అధ్యక్షుడి మార్పు?
- నడ్డాకు కేంద్రమంత్రి పదవి
- త్వరలోనే పదవీ కాలం పూర్తి



**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. తాజాగా ఆదివారం నాడు ప్రధాని నరేంద్ర మోడీతో పాటుకేంద్ర మంత్రులు అందరూ ప్రమాణ స్వీకారం చేశారు. అయితే సారి కేంద్రమంత్రిగా జేపీ నడ్డా కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన గతంలో మోడీ తొలి ప్రభుత్వంలో కూడా మంత్రిగా పని చేశారు. కాగా 2020లో ఆయన బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఆయన పదవి 2022లోనే ముగిసినా.. ఎన్నికల వరకు ఆయన్ను ఉంచాలనే ఉంచారు. ఇప్పుడు మరోసారి ఆయన్ను జాతీయ అధ్యక్షుడి పగ్గాలు తీసుకోవాలని కోరినా.. నిరాకరించడంతో కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించారు. దాంతో ఇప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడి మార్పు కొద్ది రోజుల్లోనే ఉండబోతోంది. దీంతో ఎవరికి పగ్గాలు ఇస్తారనే ఉత్కంఠ అందరిలోనూ ఉంది. కాగా బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు బలంగా వినిపిస్తోంది. కానీ దానిపై ఇంకా స్పష్టత రావాల్సింది. అయితే ఈసారి దక్షిణ భారతదేశానికి చెందిన నేతకు ఇవ్వాలనే డిమాండ్ కూడా వస్తోంది. కానీ ఎవరికి అవకాశం వస్తుంది అనేది వేచి చూడాలి.



## మోడీ తీన్మార్

**(మొదటి పేజీ తరువాయి)** మంత్రి పదవులు దక్కాయి. 72 మంది మంత్రుల్లో 43 మంది పార్లమెంట్‌లో మూడు పర్యాయాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన వారు కాగా, 39 మంది ఇంతకు ముందు కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారు. మంత్రి మండలిలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించే విధంగా ఓబీసీ నుంచి 27 మంది, షెడ్యూల్ కులాల నుంచి 10 మంది, షెడ్యూల్ తెగల నుంచి ఐదుగురు, మైనారిటీల నుంచి ఐదుగురికి మంత్రి పదవులు దక్కాయి. మైనారిటీ వ్యవహారాల మంత్రిగా కిరణ్ రిజుజు బాధ్యతలు అందుకున్నారు. ఇక మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే, బంగ్లా ప్రధాని షేక్ హసీనా, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్, మారిషస్ ప్రవీంద్ కుమార్, మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జు సహా మొత్తం ఏడు దేశాల అధినేతలు కార్యక్రమానికి హాజరయ్యారు.

**మోడీ కేబినెట్‌లో తెలుగు రాష్ట్రాల నేతలు**

ఐదుగురు తెలుగు వారికీ తన క్యాబినెట్‌లో చోటు ఇచ్చి తెలుగు రాష్ట్రాల ప్రజలు మనసు దోచుకున్నారు. తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అటు ఏపీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మరోవైపు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, నర్సాపురం ఎంపీ శ్రీనివాస్ వర్మ, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌లు సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి బీజేపీ నుంచి ముగ్గురు.. టీడీపీ తరపున ఇద్దరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

**30 మందికి కేబినెట్ హోదా**

తొలుత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆ తర్వాత వరుసగా రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జగత్ ప్రకాష్ నడ్డా, శివ రాజ్ సింగ్ చౌహాన్, నిర్మల సీతారామన్, జై శంకర్, మనోహర్ లాల్ ఖట్టర్, హెచ్.డీ. కుమార స్వామి, పియూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, జితిన్ రాం మాంజీ, రాజీవ్ రంజన్ సింగ్, సర్బానంద్ సోనేవాల్, డాక్టర్ వీరేంద్ర కుమార్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రహ్లాద్ జోషి, జ్యుయల్ ఓరమ్, గిరిరాజ్ సింగ్, అశ్వనీ వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింధియా, భూపేంద్ర యాదవ్, గజేంద్ర సింగ్ షెకావత్, శ్రీమతి అన్నపూర్ణ దేవి, కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరీ, డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, జి.కిషన్ రెడ్డి, చిరాగ్ పాశ్వాన్, సీఆర్ పాటిల్ సహా మొత్తంగా 30 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

**స్వతంత్ర హోదాలో ఐదుగురు మంత్రులు**

రావ్ ఇంద్రజిత్ సింగ్, డాక్టర్ జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘవాల్, ప్రతాప్ రావు గణపత్ రావు జాదవ్, జయంత్ చౌదరి ఐదుగురు స్వతంత్ర హోదాలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జితిన్ ప్రసాద్, శ్రీపాద యశో నాయక్, పంకజ్ చౌదరి, కిషన్ పాల్, రాందాస్ అథవాలే, రాంనాథ్ ఠాకూర్, నిత్యానంద్ రాయ్, అనుప్రియా పటేల్, సోమన్న, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, ఎస్పీ సింగ్, కేంద్ర సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

**నెహ్రూ తర్వాత చరిత్ర సృష్టించిన మోడీ**

మోడీ కంటే ముందు జవహర్ లాల్ నెహ్రూ 1952, 1957, 1962 ఎన్నికల్లో గెలిచి వరుసగా మూడు సార్లు దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇక 2014కు ముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ ఆ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా బరిలోకి దిగి పార్టీ విజయానికి కృషి చేశారు. ప్రధాని అయ్యారు. 2019 ఎన్నికల్లో తిరిగి పార్టీని గెలిపించి బీజేపీకి అత్యధిక స్థానాలను తెచ్చిపెట్టి మరోసారి ప్రధాని బాధ్యతలను చేపట్టారు. పదేళ్ల పాటు ఆయన ప్రధానిగా బాధ్యతలను నిర్వహించారు. మూడోసారి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది.

## ఎంపీ ధర్మపురికి ఝలక్!

- కేబినెట్ దక్కని అవకాశం
- మంత్రి పదవి దక్కుతుందని ఆశలు
- రాష్ట్రంలో ఇద్దరి పేర్లు చేసిన హైకమాండ్
- ఇంకా మంత్రి రేసులో పలువురు కీలక నేతలు
- మంత్రి విస్తరణ వేళ అవకాశం దక్కేనా



**విశ్వంభర, హైదరాబాద్:** ఎంపీ ధర్మపురి అరవింద్‌కు కేంద్ర కేబినెట్‌లో అవకాశం దక్కుతుందని రాష్ట్ర రాజకీయాల్లో జోరుగా ప్రచారం నడిచింది. వరుసగా ఆయన రెండోసారి ఎంపీగా గెలిచారు. ఎన్నికల సమయంలోనే తనకు మంత్రి పదవి దక్కబోతుందని మాటను ముందుకు తెచ్చుకున్నారు. ఈసారి తనను గెలిపిస్తే మంత్రిగా తిరిగి వస్తానని, కిషన్ రెడ్డితో పాటు తనకు మంత్రిపదవి పక్కా అని అరవింద్‌తో పాటు ఆయన అనుచరులు చెప్పుకున్నారు. పైగా తాను బీసీ వర్గానికి చెందిన నాయకుడిని కాబట్టి అదనపు అడ్వాంటేజ్ అని ఆయన భావించారు. కానీ మంత్రివర్గంలో తొలి జాబితాలో మాత్రం ధర్మపురి అర్వింద్‌కు నిరాశ ఎదురైంది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసి ఒక్క ఎమ్మెల్యే ఉన్నా 4 ఎంపీలను గెలిపించటంతో పాటు పార్టీని డెవప్ చేసిన బండి సంజయ్‌ను పార్టీ గుర్తించింది. ఇప్పుడొచ్చిన 8 ఎంపీల వెనుక పార్టీ క్యాడర్ నిర్మించటంలో బండి సంజయ్ కష్టం ఉందన్న నమ్[illegible]కంతోనే ఆయనకు ఛాన్స్ ఇచ్చారు. ఇక సౌమ్ముడు, వివాదరహిత [illegible]డిగా ఉన్న కిషన్ రెడ్డికి మరోసారి పొడిగింపు దక్కినట్లు కనపడుతోంది.

**పదవులపై మరికొందరి ఆశలు**

వీరిద్దరితో పాటు ఈటల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా తమకు కేంద్ర మంత్రివర్గంలో చోటు వస్తుందన్న ఆశలో ఉన్నవారే. అయితే భవిష్యత్‌లో జరిగే క్యాబినెట్ విస్తరణలో ఒక్క సహాయ పదవి అయినా దక్కుతుందన్న ఆశ ఇంకా తెలంగాణ బీజేపీ నేతల్లో ఉంది. అందులో భాగంగానే మరి కొందరు ఆశావాహులు ఉన్నారు. మాజీ మంత్రి డి.కె.అరుణ, మెదక్ నుంచి ఎన్నికైన రఘునందన్ రావు కేబినెట్ పదవుల ఆశించిన వారిలో ఉన్నారు. అయితే మంత్రి విస్తరణ చేసే సమయంలో రాష్ట్రం నుంచి ఎవరికి దక్కుతుందో సర్వత్రా ఆసక్తికరంగా మారింది.



## మోడీకి థ్యాంక్స్

- నిఖార్సైన కార్యకర్తకు మంత్రీ పదవి ఇచ్చారు
- వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మాదే అధికారం
- రాజకీయ బలం లేకున్నా 8 సీట్లు గెలిచాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**విశ్వంభర, ఢిల్లీ:** తెలంగాణకు ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి ఇచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోడీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ప్రమాణస్వీకారానికి ముందు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో నిఖార్సైన కార్యకర్తకు మంత్రి పదవి ఇచ్చారని ప్రశంసలు కురిపించారు. తెలుగు రాష్ట్రాలలో (ఏపీ నుంచి ఒకరు, తెలంగాణ నుంచి ముగ్గురు) బీజేపీ కార్యకర్తలకు మంత్రి పదవి దక్కడం బీజేపీ సిద్ధాంత బలానికి నిదర్శనమని అన్నారు. వారసత్వ రాజకీయ బలం లేకున్నా సిద్ధాంతాన్ని నమ్ముకొని నిలబడ్డామని అన్నారు. తెలంగాణలో స్వతంత్రంగా 8 స్థానాలు సాధించామన్నారు. 36 శాతం ఓట్లతో బీజేపీలో కొత్త చరిత్ర సృష్టించామని, నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో 88 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అందరూ కష్టపడి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు.

**తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం పని చేస్తాం**

వచ్చే పదేళ్లు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ సంకల్ప పత్రం పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం పనిచేస్తామన్నారు. గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం 4 కోట్ల ఇళ్లు నిర్మించిందన్నారు. వచ్చే ఐదేళ్లలో మరో 3 కోట్ల ఇండ్లు నిర్మిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో బీజేపీని మరింత పటిష్టం చేయాలని కార్యకర్తలను కోరుతున్నానని చెప్పారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ ముసుగులో మజ్లిస్ పార్టీ పోటీ చేసిందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## అక్షర యోధుడికి కన్నీటి వీడ్కోలు

**(మొదటి పేజీ తరువాయి)** నినాదాలు చేశారు. ఈ నినాదాల మధ్యే అంత్యక్రియలు ముగిశాయి. అంతిమ సంస్కారాల్లో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి, పోచారం, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఎంపీలు కేఆర్ సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ నాయకులు వేం నరేందర్ రెడ్డి, వీహెచ్, టీడీపీ ఎమ్మెల్యే రఘురామక్రిష్ణ రాజు, వెనిగండ్ల రాము, బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఏపీ నాయకులు సుజనా చౌదరి, దేవినేని ఉమ, చింతమనేని ప్రభాకర్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూరి జస్టిస్ ఎన్వీ రమణ, సినీ దర్శకుడు బోయపాటి శ్రీను సహా ఎంతో మంది ప్రముఖులు పాల్గొన్నారు.

**పాడె మోసిన చంద్రబాబు**

రామోజీరావు అంత్యక్రియలకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. రామోజీ అంతిమయాత్రలో పాల్గొన్న చంద్రబాబు ఉద్వేగానికి లోనయ్యారు. రామోజీ పాడె మోసి తన గౌరవం చాటుకున్నారు. రామోజీ నివాసం నుంచి సాగిన యాత్రలో పాల్గొని పాడె మోశారు. స్మృతివనం వద్ద రామోజీకి కడసారి వీడ్కోలు పలికారు. పూలతో రామోజీ పార్థివదేహానికి నివాళులర్పించారు. తన స్మారక కట్టడాన్ని ముందే ఆయన సిద్ధం చేసుకున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని విశాలమైన ప్రాంతంలో ఆయన నిర్మాణం చేయించుకున్న ఆ స్మృతి కట్టడం వద్ద అంతిమ సంస్కారాలు జరిగాయి. ఈ అంత్యక్రియలకు ఈనాడు, రామోజీ గ్రూపు సంస్థలకు చెందిన ఉద్యోగులు వందల సంఖ్యలో తరలివచ్చాయి.








అమిత్ షా

## ప్రమాణస్వీకారం చేసిన



జేపీ నడ్డా



రాజ్‌నాథ్ సింగ్

# కేంద్ర కేబినెట్ మినిస్టర్స్




అజయ్ తంప్టా | అనుప్రియ పటేల్ | అన్నపూర్ణాదేవి | హర్దీప్ సింగ్ | అర్జున్ మేఘవాల్ | అశ్వనీ వైష్ణవ్ | ఎల్ మురుగన్ | ఎస్.జైశంకర్ | ఎస్పీ సింగ్ బఘేల్



కమలేశ్ పాసవాన్ | కిరణ్ రిజుజు | కీర్తివర్ధన్ సింగ్ | క్రిషన్ పాల్ | గజేంద్ర సింగ్ షెకావత్ | గిరిరాజ్ సింగ్ | చిరాగ్ పాసవాన్ | జయంత్ చౌదరి | జార్జ్ కురియన్



జితన్‌రాం మాంఝీ | జితిన్ ప్రసాద్ | జితేంద్ర సింగ్ | జుయల్ ఓరం | హర్ష మల్హోత్రా | జ్యోతిరాదిత్య సింధియా | తోకన్ సాహు | దుర్గాదాస్ ఉయికె | ధర్మేంద్ర ప్రదాన్



నితిన్ గడ్కరీ | నిత్యానంద్ రాయ్ | నిముబెన్ బంభానియా | నిర్మలా సీతారామన్ | పంకజ్ చౌదరి | పవిత్ర మార్గెరెటా | పీయూష్ గోయల్ | ప్రతాప్ రావ్ గణపత్ రావు జాదవ్ | బీఎల్ వర్మప్రహ్లాద్ జోషి



బీఎల్ వర్మ | భగీరథ్ చౌదరి | భూపేంద్ర యాదవ్ | మనోహర్‌లాల్ ఖట్టర్ | మన్‌సుఖ్ మాండవీయ | మురళీధర్ మొహోల్ | రక్షా నిఖిల్ ఖడ్సే | రన్‌వీర్ సింగ్ | రాందాస్ అఠవలే



రాజ్ భూషణ్ చౌదరి | హెచ్‌డీ కుమారస్వామి | రామ్‌నాథ్ ఠాకూర్ | రావ్ ఇంద్రజీత్‌సింగ్ | లలన్ సింగ్ | వీరేంద్ర కుమార్వీరేంద్ర కుమార్ | శాంతను ఠాకూర్ | శివరాజ్ సింగ్ చౌహాన్ | శోభా కరంద్లాజే



శ్రీపాద్ యశో నాయక్ | సంజయ్ సేథ్ | సతీశ్ చంద్ర దూబె | సర్బానంద సోనోవాల్ | సావిత్రి ఠాకూర్ | సీఆర్ పాటిల్ | సుఖాంత్ మజుందర్ | సురేష్ గోపీ | సోమన్న

# నియంత్రణ లోపించిన కాలుష్య నియంత్రణ బోర్డు




- మీటింగుల్లో గొప్పలు- నియంత్రణకు తిలోదకం
- కాలుష్య నియంత్రణలో విఫలం
- మొక్కుబడిగా తనిఖీలు
- మామూళ్ల వసూలుకే తనిఖీలు అంటున్న జనాలు
- బాధితులు గగ్గోలు పెడుతున్న పట్టించుకోని వైనం

ఆనవాయితీగా పర్యావరణ దినోత్సవం ఏడాదికి ఒకరోజు జూన్ 5 న పర్యావరణం రక్షించుకోవాలని, పర్యావరణనికి హాని చేసే వారిపై, పరిమితి మించి కాలుష్యాన్ని విడుదల చేసే కంపెనీలు, ఫ్యాక్టరీలపై, యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం కోసం నిరంతరం చిత్తశుద్ధితో, నిబద్ధతతో పనిచేస్తున్నామంటారు. ప్రతి పౌరుడు, స్వచ్ఛంద సంఘాలు కాలుష్య నివారణలో సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘించే, కాలుష్యం వెదజల్లే వారిపై ఫిర్యాదులు, సమాచారం వచ్చిన క్షణాల్లో చర్యలు తీసుకుంటామని మీటింగుల్లో మాత్రమే చెబుతూ.. హాజరైన వారితో చప్పట్లు కొట్టించుకోవడం ఆనవాయితీగా మారింది.. అసలు విషయం ఏమిటంటే. కాలుష్య నియంత్రణ బోర్డుకు కాలుష్యం వెదజల్లే కంపెనీలపై ఆధారాలతో బాధితులు, స్వచ్ఛంద సంఘాలు, పర్యావరణ రక్షణ కోసం పనిచేస్తున్న సంఘాల సభ్యులు సమాచారాన్ని ఇచ్చినా, ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడానికి, విచారణ చెయ్యడానికి కాలుష్య నియంత్రణ బోర్డు శాఖ అధికారులకు సమయం ఉండదు. వారి మామూళ్ల వసూళ్ల పనుల్లో బిజిగా ఉంటారు. కాలుష్య నియంత్రణ బోర్డు నిర్దేశించిన పనులు, విధులు మావి కావు అన్నట్టుగా వ్యవహరిస్తారు. ఫిర్యాదు దారులకు సహకరించకుండా, విచారణలు చెయ్యడంలో జాప్యం చేస్తారు. అదే సమయంలో సంబంధిత కంపెనీలకు ఫిర్యాదు దారుల వివరాలు ఫోన్ నెంబర్లను తెలియజేయడం చేస్తున్నారని బాధితులు,
ఫిర్యాదు దారులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణ నిజం అనుకునే విధంగా సంబంధిత కంపెనీల యాజమాన్యం కాలుష్యాన్ని నియంత్రణ బోర్డు ఆదేశాల్లో వున్న విధంగా చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించకుండా కాలుష్య నియంత్రణకు తగిన పరికరాలు, యంత్రాలు, సదుపాయాలను ఏర్పరచడంలో దృష్టి పెట్టకుండా బాధితులను, ఫిర్యాదు దారులను బెదిరించడం, రాజకీయ నాయకులతో వత్తిడి చేయించడం, ప్రలోభాలకు గురిచేయడం, వీటికి వినక పోతే బెదిరించి, భౌతిక దాడులు చెయ్యడం జరుగుతున్న చరిత్ర.
వీటికి లొంగకుండా కంపెనీలను సందర్శించి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వత్తిడి చేస్తే కాలుష్య నియంత్రణ అధికారులు విచారణలు మొక్కుబడిగా చేసి పరిమితి లోనే కంపెనీలు పని చేస్తున్నాయని తప్పుడు నివేదికలు ఇస్తున్నారు. విచారణ అధికారులు విచారణకు వచ్చే ముందుగానే సంబంధిత కంపెనీలకు సమాచారం అందజేయడం వల్ల వారు జాగ్రత్త పడుతూ.. కంపెనిలోని యంత్రాలను, పరిమితికి లోబడిన వేగంలో నడపడం, కాలుష్యం ఎక్కువ వెదజల్లే యంత్రాలను ఆ సమయంలో నడపకుండా చెయ్యడం చేస్తున్నా.. అధికారులు సమగ్రంగా విచారణ చెయ్యకుండా బాధితులను, ఫిర్యాదు దారులను మభ్యపెట్టే విధంగా విచారణలు చేస్తున్నారు.

### నిజం నిగ్గు తేలాలంటే..

కాలుష్యం వెదజల్లే కంపెనీలపై ఫిర్యాదు అందిన వెంటనే ఆకస్మికంగా దాడులు, విచారణ జరగాలి. వాస్తవ పరిస్థితులకు నిర్ధారించే విధంగా నిష్పక్షపాతంగా విచారణ చేసి రిపోర్టులు జారీ చెయ్యాలి. థర్డ్ పార్టీ (ఒక జిల్లా అధికారులు, మరొక జిల్లాలో) ఆకస్మిక తనిఖీలు చెయ్యాలి. నిబంధనలు ఉల్లంఘించిన, కాలుష్యాన్ని వెదజల్లుతున్న కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధిక మొత్తంలో జరిమానాలు విధించాలి. బాధితులకు, పర్యావరణానికి, ప్రాణి కోటికి జరిగిన హానిని లెక్కించి 10 రేట్ల జరిమానా విధించాలని ఉన్న నిబంధనలను అమలు చెయ్యాలి. మనషుల మరణాలకు, అనారోగ్యానికి జరిగిన నష్టానికి తగ్గట్టుగా, చికిత్సకు సరిపొయ్యే విధంగా, తగిన నష్టపరిహారాన్ని బాధితులకు ఇప్పించాలి.

**సీఎస్సార్ అంత బూటకమే..**

కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశాల్లో ప్రతి కంపెనీ తమ ఆదాయంలో కనీసం 5 శాతాన్ని కంపెనీ ప్రభావిత పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటడం, రక్షించడం, అదేవిధంగా పరిసర గ్రామాల్లో గల ప్రజల ఆరోగ్యం రక్షణకు, అనారోగ్యం బారిన పడిన ప్రజలకు ఉచితంగా వైద్యం చేయించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చెయ్యడం ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం సీఎస్సార్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో మొదటి ప్రాధాన్యతగా చెయ్యాలి. సీఎస్సార్ నిధులతో పరిసర ప్రాంత ప్రజల అభ్యర్థన మేరకు సురక్షిత తాగునీరు అందించాలి. ఉచితంగా విద్యను అందించాలి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను ఖర్చు చెయ్యాలి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్లు వెయ్యాలి. మురికి కాలువలు కట్టించాలి. అన్ని పనులు సీఎస్సార్ నిధులతో చెయ్యాలని ఉన్నా.. ఆ సీఎస్సార్ నిధులతో ఏమి చేశారు అనే రిపోర్టును కాలుష్య నియంత్రణ బోర్డు అడగక పోవడం, పరిశ్రమల యాజమాన్యం వారు ఇవ్వక పోవడం జరుగుతుంది.
సీఎస్సార్ అనేది కేవలం కాగితాలకే పరిమితం. కొన్ని చోట్ల ""గోరంత చేసి కొండంత చేసినట్లుగా చూపుతున్నారని తెలుస్తున్న సత్యం. దీని విషయంలో సమాచార హక్కు చట్టం2005 ప్రకారంగా సమాచారం కోరినా మా వద్ద సీఎస్సార్‌కు సంబంధించి కంపెనీలు చేసిన పనుల వివరాలు లేవు అని పీసీబీ బోర్డు అధికారులు, జిల్లా కలెక్టర్‌లు సమాధానం ఇవ్వడం లోనే సీఎస్సార్ అనేది అంత బూటకమని స్పష్టం అవుతుంది.
సీఎస్సార్‌తో చేసిన పనుల వివరాలు పరిసర ప్రాంతాల ప్రజలందరికీ తెలిసేలా గ్రామ పంచాయితీలో బోర్డు ఏర్పాటు చేసి దానిలో వివరాలు చూపాలి. కంపెనీ వల్ల ప్రజలకు జరిగే మేలు తెలుస్తుంది. కానీ సీఎస్సార్‌తో కంపెనీలు చెబుతున్న విషయాలు కేవలం పీసీబీ అధికారులకు, కలెక్టర్‌కు ఇవ్వడం చేస్తున్నారు. అంటే సీఎస్సార్ అంటే ఎందుకు నిర్లక్ష్యం. 5 శాతం డబ్బులు పాలకులకు, అధికారుల జేబుల్లోకి పోతున్నాయని ప్రజలు అనుకుంటున్నారు. దీనిలో 100 శాతం వాస్తవం ఉన్నదని చెప్పొచ్చు.
మామూళ్ల వసూలు కోసమే తనిఖీలు
కంపెనీలను తనిఖీలు చేయు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కేవలం మొక్కుబడిగా, మామూళ్ల వసూలు కోసం, శాఖ నిర్దేశించిన లక్ష్యాల కోసమే తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాస్తవాలను ప్రతిబింబించే రిపోర్టులు చెయ్యడం లేదు. దీనికి కారణం డబ్బులు, కానుకలు, బహుమతులు, రిపోర్టును బట్టి రేటు వంటి ప్రలోభాలకు గురి కావడం రాజకీయ వత్తిడులు వల్ల వాస్తవాలను రిపోర్టులో చూపలేక పోతున్నామని కొందరు పీసీబీ అధికారులు అనడం బట్టి చూస్తే కాలుష్య నియంత్రణ బోర్డ్ పేరుకే తప్ప అమలులో పూర్తిగా విఫలం అవుతున్నారు.

**పర్యావరణం కాపాడాలంటే..**

1) పర్యావరణానికి హాని చేయు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. 2)అనుమతులు లేకుండా చెట్లను కొట్టిన వారిపై జరిమానాలు విధించాలి. 3)పరిమితి మించి కాలుష్యాన్ని వెదజల్లే కంపెనీలను నిర్దాక్షిణ్యంగా మూసి వెయ్యాలి. 4) సీఎస్సార్ నిధులతో అధికంగా చెట్లను నాటించి వాటిని రక్షించాలి. 5) పీసీబీకి ఫిర్యాదులు అందిన వెంటనే అదేరోజు ఆకస్మికంగా తనిఖీలు చెసి వాస్తవ రిపోర్టులు ఇవ్వాలి. 6) పర్యావరణ పరిరక్షణలో ప్రధానమైనది చెట్లను అధికంగా నాటి రక్షించిన వారిని ప్రభుత్వం ఆధ్వర్యంలో అభినందించి, సన్మానం చెయ్యడం, అవార్డులు ఇవ్వడం చెయ్యాలి. 7) సీఎస్సార్‌ను 10 కిలోమీటర్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో చెయ్యాలి. 8) అనారోగ్య సమస్యలతో బాధపడే పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్యం చెయాలి. వారికి అవసరమైన ఔషదాలను ఉచితంగా అందజేయాలి. 9) ప్రభుత్వ భూముల్లో చెట్ల పెంపకం, పరిశ్రమలు ఆధ్వర్యంలో మొక్కలు పెట్టించి రక్షణ చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పర్యావరణ రక్షణ చర్యలపై, చెట్ల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.



- డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి,
ఎంఏ, ఎంసీజే, ఎల్ఎల్‌బీ
సమాచార హక్కు వికాస సమితి
వ్యవస్థాపక అధ్యక్షుడు
ఫోన్ : 99496 49766

# ఈనాడు అధినేత అస్తమయం!



డబ్బు దాచుకోండిరా మార్గదర్శిలో అన్నాడు
రేపటి పౌరిడిగా ఎదగాలంటే ఈనాడు చదవమన్నాడు
అన్నం పెట్టే అన్నదాతకే ప్రాముఖ్యం ఇచ్చాడు
చిత్ర సీమలో చెరగని సితారగా మిగిలారు
కథలు నవలలు చదవండని చతుర విపుల తీసుకొచ్చారు
బుల్లి తెరలో విప్లవా త్మకంగా ఎనిమిది ఈటీవీ మీటివి అన్నారు
రస రంజకంగా పాడుతా తీయగా వంటి కార్య క్రమాలు తీసుకు వచ్చారు
ఉషా కిరణ్ మూవీస్ పేరుతో అనేక స్ఫూర్తి దాయక సినిమాలు తీశారు
లక్షల ముందికి ఉపాధి అవకాశం ఇచ్చారు
ప్రపంచంలోనే అద్భుతమైన రామోజీ ఫిల్మ్ సిటీని రూపొందించారు
ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి పరిచారు
మాతృభాష తెలుగుని తెలుగు వెలుగుగా రూపొందించారు.
మార్గదర్శి కార్యక్రమం ఈటీవీలో చేర్చి మార్గ దర్శిగా నిలిచారు
శ్రీధర్ కార్టూన్ 40 ఏళ్ళు నిండేలా చేశారు.
నోరూరించే ప్రియా పచ్చళ్లకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా నిలిచారు.
అసలు సిసలు పాత్రి కేయుడిగా అక్షర యోధుడిగా నిలిచారు
రాజ కీయాలలో లేరు కానీ మంచి రాజకీయాలకు వెన్ను దన్నుగా నిలిచారు.
సరియైన దారి చూపించారు
అంతర్యామి పేరుతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా రూపొందించారు
శ్రీ రామోజీ రావు పేరు తెలియని తెలుగు వారు ఎవరూ ఉండరు.
విజ్ఞన వేత్త, వ్యాపార వేత్త
మహిళాభ్యుదయాన్ని కోరుకున్న అభ్యుదయ వాది
తెలుగు వారు అందరికి గర్వకారణం... చెరుకూరి రామోజీ రావు!

పీఎస్ఎన్ రాజు
జూబ్లీహిల్స్

# పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్

## నేడు పౌర హక్కుల పోరాట యోధుని జయంతి



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్‌కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లల్లో ఐదవ సంతానం కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్.. మాతామహుడు.. ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలుగా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్‌డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకుడిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితమయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరుసల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకుడాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగులోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచుకున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఏపీసీఎల్సీ) ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఏపీసీఎల్సీలో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఏపీసీఎల్సీని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు (ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులతో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాల్లో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్య హింసతోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎంఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి. మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శిం చడం నక్సలైట్ల నుంచి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్‌లోని లాల్‌ఘడ్‌లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్‌ను లాల్‌గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఈపీడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాల్లో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సీపీఐమావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్యకలాపాలను విస్తరించాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించి బహిర్గతం చేశాడు. పోలీసులు హత్యలను ఎదుర్కో వటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యా నేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారా హిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# హాస్య రస ప్రధాన చిత్ర దర్శకుడు ఈవీవీ

## నేడు ఈవీవీ సత్యనారాయణ జయంతి



టాలీవుడ్‌లో అత్యంత విజయ వంతమైన దర్శకుడిగా ఈవీవీ సత్యనారాయణ నిలిచాడు. ఆయన 80 మరియు 90 లలో చాలా సూపర్ హిట్స్ ఇచ్చారు. రాఘవేంద్ర రావు సీనియర్ దర్శకుడిగా దూసుకుపోతున్న రోజుల్లో ఆయనకు గట్టి పోటీ ఇచ్చి అంతకు మించిన హిట్లు అందు కున్నాడు ఈవీవీ. రాఘవేంద్ర రావు స్టార్ హీరోలతో సినిమాలు తీస్తే, ఈవీవీ చిన్న హీరోలు, మధ్యస్థ హీరోలతో తీసి, హిట్లు, సూపర్ హిట్లు సాధించాడు. ఆయన సినిమాల్లో కామెడీకి పెద్ద పీట వేసేవాడు. అప్పట్లో చాలా బాధగా ఉంటే.. మద్యం వదిలేసి ఈవీవీ సినిమాలు చూడండి అంటూ జోకులు కూడా వేసుకునే వాళ్లట. అయితే తొలుత ఈవీవీ తన మొదటి సినిమా రాజేంద్రప్రసాద్‌ను హీరోగా పెట్టి తీసిన చెవిలో పువ్వు చిత్రం పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఫ్లాప్ అయ్యిందని... గోదావరిలో దూకి చావాలని అనుకున్నాడట. ఓ సారి రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ అఘాయిత్యానికి పాల్పడదాం అనుకుని.. మళ్ళీ తన పిల్లలు, భార్య గుర్తొచ్చి ఆగిపోయాడట.
తరువాత ఆయన ప్రతిభను గుర్తించిన నిర్మాత రామానాయుడు 'ప్రేమఖైది' అనే చిత్రం చేసే అవకాశం కల్పించారు. అది పెద్ద హిట్ అయ్యింది. దీంతో వరుస అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి... అంటూ ఆయన చిన్న కొడుకు అల్లరి నరేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.
ఈవీవీగా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ (జూన్ 10, 1958 జనవరి 21, 2011) తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. జంధ్యాల శిష్యుడు. జంధ్యాల ఒరవడిలో హాస్య ప్రధాన చిత్రాలు నిర్మించాడు. జంధ్యాల కంటే కొంతఘాటైన హాస్యాన్ని చిత్రాల్లో ప్రవేశ పెట్టాడు. రాజేంద్రప్రసాద్‌తో ఆ ఒక్కటి అడక్కు, అప్పుల అప్పారావు, ఆలీబాబా అరడజను దొంగలు వంటి చిత్రాలు, నరేష్ తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశాడు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది (శోభన్ బాబు) లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి లేడీస్ ఓరియంటెడ్ చిత్రాలు తీశాడు. అగ్రనటులైన చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్‌లతో చిత్రాలు తీశాడు. తర్వాత తన కుమారులిద్దర్ని హీరోలుగా పరిచయం చేశాడు.
సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని దొమ్మేరులో వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. నాన్న వెంకటరావు, అమ్మ వెంకటరత్నం. ఆయన కుటుంబానికి దొమ్మేరులో 70 ఎకరాల పొలం ఉండేది. బాల్యం నుంచి సినిమాలంటే ఆసక్తితో కనీసం వారానికి రెండు సినిమాలైన చూసేవాడు. ఇంటర్మీడియట్ వరకు బుద్ధిగానే చదివినా, ఇంటర్‌కు నిడుదవోలు వెళ్ళిన సత్యనారాయణ కాలేజికి వెళ్ళకుండా రోజూ ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట సినిమాలను చూడటం ఎక్కువై, హాజరు తక్కువై ఇంటర్మీయడ్ తప్పాడు. అప్పుడు సత్యనారాయణ తండ్రి ఆయనను కాలేజీకి పంపించి లాభం లేదని నిశ్చయించి తండ్రితో పాటు పొలం పనులు చూసుకోవటానికి నియమించాడు. 19 యేళ్ళకే 1976లో సరస్వతి కుమారితో పెళ్ళైంది. తర్వాత ఇద్దరు కొడుకులు పుట్టారు. వారికి రాజేష్, నరేష్ అని పేరు పెట్టారు. కొన్నాళ్ళకు వ్యవసాయంలో పెద్ద నష్టాలు రావడంతో పొలాలు అమ్మేయ వలసిన పరిస్థితి కలిగింది. ఆ పరిస్థితుల్లో అక్కడ ఉండటానికి సత్యనారాయణ ఇబ్బంది పడి ఎక్కడికైనా మరో ఊరికి వెళ్ళిపోవాలను కున్నాడు. ఈవీవీ స్నేహితుడు నిర్మాత నవతా కృష్ణంరాజు మేనల్లుడైన సుబ్బ రాజును సంప్రదించి ఒక సిఫారుసు ఉత్తరం పట్టుకుని మొదటిసారి మద్రాసు వెళ్ళాడు. నవతా కృష్ణం రాజును కలిసి ఉత్తరం ఇవ్వగా ఆయన సినీరంగంలో జీవితం అనుకున్నంత సులభం కాదని, తిరిగి సొంత ఊరికి వెళ్ళిపొమ్మని హితవు చెప్పాడు. దాంతో పూర్తిగా నిరాశచెందిన సత్యనారాయణ, తిరిగి వెళ్ళినా చేసేదేమీ లేదనుకుని మద్రాసులోనే ఉండి వివిధ ప్రదేశాలు తిరుగు తుండేవాడు. పాండీ బజారుకు వెళ్ళి అక్కడ సహాయ దర్శకులు చెప్పుకునే మాటలు వినేవాడు. ప్రతి ఉదయం నవత కృష్ణంరాజు కార్యాలయం గేటు వద్ద నుంచుని ఉండేవాడు. ఒక నెలరోజుల తర్వాత కుర్రవాని పట్టుదలను చూసి ఏం చెయ్య గలవు అని నవత కృష్ణంరాజు అడిగాడు. సహాయ దర్శకుడిని అవుతానని చెప్పిన ఈవీవీని కనకాల దేవదాసు క్రింద ఓ ఇంటి భాగోతం సినిమాకు సహాయ దర్శకుడిగా అవకాశం కల్పించాడు.
రంభ, రచన, ఊహ, రవళి నటీమణులను తెలుగు చిత్ర సీమకు అయన పరిచయం చేశాడు.

**విజయవంతమైన ఈవీవీ సినిమాలు**

చెవిలో పువ్వు (1990), ప్రేమ ఖైదీ (1991), అప్పుల అప్పారావు (1991), సీతారత్నం గారి అబ్బాయి (1992), 420 (1992), జంబలకడి పంబ (1992), ఏవండీ ఆవిడ వచ్చింది (1993), వారసుడు (1993), ఆ ఒక్కటీ అడక్కు (1993), అబ్బాయి గారు (1993), ఆలీబాబా అరడజను దొంగలు (1994), హలో బ్రదర్ (1994), మగ రాయుడు (1994), ఆమె (1994), అల్లుడా మజాకా (1995), ఆయనకి ఇద్దరు (1995), తెలుగు వీర లేవరా (1995), ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు (1996), అదిరింది అల్లుడు (1996), అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (1996), చిలక్కొట్టుడు (1996), వీడెవడండీ బాబు (1997), నేను ప్రేమిస్తున్నాను (1997), తాళి (1997), మా నాన్నకి పెళ్ళి (1997), ఆవిడా మా ఆవిడే (1998), మావిడాకులు (1998), కన్యాదానం (1998), నేటి గాంధీ (1999), సూర్యవంశం (1999), పిల్ల నచ్చింది (1999), చాలా బాగుంది (2000), గొప్పింటి అల్లుడు (2000), అమ్మో ఒకటో తారీఖు (2001), మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది (2001), థ్యాంక్యూ సుబ్బారావ్ (2001), వీడెక్కడి మొగుడండి (2001), హాయ్ (2002), తొట్టి గ్యాంగ్ (2002), ఆడంతే అదోటైపు (2003), మా అల్లుడు వెరీగుడ్డు (2003), ఆరుగురు పతివ్రతలు (2004), ఎవడి గోల వాడిది (2005), నువ్వంటే నాకిష్టం (2005), కితకితలు (2006), అత్తిలి సత్తిబాబు ఎల్ కేజీ (2007), పెళ్ళైంది కానీ... (2007), ఫిట్టింగ్ మాస్టర్ (2009), బెండు అప్పారావ్ ఆర్ఎంపీ (2009), బురిడి (2010), కత్తి కాంతారావు (2010) తదితర చిత్రాలకు దర్శకత్వం వహించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# టీబీజేపీ చీఫ్‌గా ఈటల రాజేందర్ ?



## కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడి మృతి

**విశ్వంభర, జనగామ :** వీధికుక్కల దాడిలో పిల్లలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కంటికి పాపలా కాపాడుకుంటున్న పిల్లలను కుక్కలు పీక్కు తినేస్తున్నాయి. తాజాగా మరో విషాద ఘటన వెలుగుచూసింది. జనగామ జిల్లాలలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా చిల్పూర్ మండలం నునావత్ తండాలో గుగులోత్ మధు, సరిత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు గుగులోత్ శివరామ్(6) ఉన్నాడు. అయితే ఎప్పటిలాగే ఇంటి వద్దే పిల్లాడిని ఉంచి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. అయితే తిరిగి వచ్చి చూసేసరికి బాలుడిజాడ కనిపించలేదు. సమీపంలో కుక్కల అరుపులు వినిపిస్తుండటంతో వెళ్లి చూసే సరికి వారి గుండె పగిలినంత పనైంది. చెట్ల పొదల్లో బాలుడు పడి ఉండగా అప్పటికే కుక్కల దాడిలో బాలుడు తీవ్రంగా గాయాలపాలై మృతిచెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కొడుకు కళ్లముందు విగత జీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## 12 రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

**విశ్వంభర, హైదరాబాద్ :** వచ్చే రెండు రోజుల్లో పశ్చిమ బెంగాల్, సిక్కిం, అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ లలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు ఐఎండీ వివరించింది.

## జగిత్యాలలో ఇన్విజిలేటర్ అత్యుత్సాహం..

**విశ్వంభర, జగిత్యాల, జూన్ 9:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం టీజీపీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే జగిత్యాల జిల్లాలోని ఓ పరీక్ష కేంద్రంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఓ ప్రైవేటు కాలేజీలో పరీక్ష జరుగుతున్న సమయంలో ఇన్విజిలేటర్ అత్యుత్సాహంతో అభ్యర్థులకు తప్పుడు ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు. పరీక్ష ముగియడానికి ఇంకా అరగంట ఉండనంగా.. ఇంకా ఐదు నిమిషాలే ఉందని అభ్యర్థులను తొందర పెట్టాడు. దీంతో సదరు ఇన్విజిలేటర్ అత్యుత్సాహం కారణంగా సమయం మించి పోతుందని అభ్యర్థులు తొందరలో ఓఎమ్ఆర్ షీట్‌లో ఏదో ఒక ఆన్సర్‌ను బబుల్ చేశారు. తీరా చేస్తే ఇంకా సమయం ఉందని తెలియడంతో ఆ గదిలోని గ్రూప్1 అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఇన్విజిలేటర్ తొందర పెట్టినందున కొన్ని ప్రశ్నలకు ఏదో ఒక ఆన్సర్ పెట్టి పరీక్ష త్వరగా ముగించామని, దీంతో తమకు మార్కులు తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్ 1 పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఓఎమ్ఆర్ షీట్‌పై పెన్సిల్‌తో కాకుండా.. బ్యాక్ లేదా బ్లూ కలర్ పెన్ను మాత్రమే వినియోగించాలని హాల్ టికెట్లపై కమిషన్ స్పష్టం పేర్కొంది. దీంతో అభ్యర్థులంతా పెన్‌తోనే ఆన్సర్లను బబుల్ చేశారు. తప్పుగా గుర్తించిన సమాధానాలను ఎరైజర్‌తో చెరిపి సరైన సమాధానం పెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇన్విజిలేటర్ చేసిన తప్పిదానికి తామంతా సరైన సమాధానాలు గుర్తించకుండానే ఓఎమ్ఆర్ షీట్ నింపేశామని, తమకు మార్కులు తక్కువవచ్చే అవకాశం ఉందని ఆ గదిలోని అభ్యర్థులంతా ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ కాలేజీ ఎదుట వారంతా నిరసన చేపట్టారు.

## సినీ ఫక్కీలో వ్యాపారవేత్త కిడ్నాప్..

**విశ్వంభర, నార్సింగి, జూన్ 9:** కొందరు దుండగులు ఓ వ్యాపారవేత్తను సినీ ఫక్కీలో కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు. అంతలో పోలీసులు ఎంట్రీ ఇవ్వడంతో కథ అడ్డం తిరిగింది. షాకింగ్ ఘటన హైదరాబాద్ పరిధిలోని నార్సింగిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. నార్సింగికి చెందిన శశివర్దన్ రెడ్డి అనే వ్యాపారవేత్తను గుర్తు తెలియని గ్యాంగ్ శనివారం అర్ధరాత్రి సమయంలో కారులో బలవంతంగా ఎక్కించుకుని పరారయ్యారు. ఈ విషయం తెలుసుకున్న శశివర్దన్ కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన పోలీసులు సినీ ఫక్కీలో కిడ్నాపర్ల కారును చేజ్ చేశారు. కర్నూలు వైపు వెళ్తుండగా మహబూబ్‌నగర్ జిల్లాలో కిడ్నాపర్లను అడ్డగించారు. కారును నిలువరించిన నార్సింగ్ పోలీసులు కిడ్నిపర్లను పట్టుకున్నారు. రాయలసీమకు చెందిన గ్యాంగ్‌గా పోలీసులు గుర్తించారు.పోలీసులు సమయానికి స్పందించడంతో శశివర్ధన్‌ను క్షేమంగా రక్షించగలిగారు. ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్‌కు కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

- తెలంగాణలో అధికారమే లక్ష్యంగా స్కెచ్
- కమలం హైకమాండ్ వ్యూహాత్మక నిర్ణయం

**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలో ఎన్డీఏ కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో.. తెలంగాణపై బీజేపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించినట్టు కనిపిస్తోంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న నరేంద్ర మోదీ తన జట్టులోకి తెలంగాణ నుంచి కిషన్ రెడ్డిని, బండి సంజయ్ కుమార్‌ను ఇద్దరిని తీసుకుంటున్నారు. అయితే.. దేశవ్యాప్తంగా రాష్ట్ర అధ్యక్షులకు మార్చే యోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీలో ఒక వ్యక్తికి ఒకే పదవి అనే సూత్రం ఆధారంగా ఇప్పటివరకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కిషన్ రెడ్డికి మరోసారి కేంద్రమంత్రిగా అవకాశం కల్పించడంతో.. పార్టీ బాధ్యతలు ఇతరులకు ఇవ్వాలని హైకమాండ్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్‌లో మాస్ లీడర్‌గా ఎదిగి అనివార్య కారణాలతో బీజేపీలోకి వచ్చి ఇక్కడ సైతం కీలక నేతగా మారిన ఈటల రాజేందర్‌కు రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పజెప్పాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.

### అసంతృప్తికి చెక్

ఈటల రాజేందర్.. తాజాగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో దేశంలోనే అతిపెద్దదైన లోక్ సభ నియోజకవర్గం మల్కాజిగిరి నుంచి బరిలోకి దిగి 3 లక్షలకు పైగా భారీ మెజార్టీతో గెలిచారు. అయితే.. మాస్ లీడర్ అయిన ఈటలకు ఈసారి మోదీ కేబినెట్‌లో ఛాన్స్ ఇస్తారని అంతా అనుకున్నా.. అది జరగలేదు.



మరోవైపు.. డీకే అరుణ, ధర్మపురి అరవింద్‌కు కూడా మంత్రివర్గంలో అవకాశం ఇస్తారని ప్రచారం నడిచినా.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాత్రమే ఆ ఛాన్స్ దక్కింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతోన్న హైకమాండ్, పార్టీ బాధ్యతలను ఈటలకు అప్పగించనున్నారు. కాగా.. పార్టీలో చేరినప్పటి నుంచి ఈటలకు అధిష్ఠానం సముచిత స్థానం ఇవ్వట్లేదన్న అసంతృప్తి ఆయన అభిమాన వర్గాల్లో ఉంది. ఈ క్రమంలోనే.. ఆయనకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వడం ద్వారా.. అటు ఈటలను సంతృప్తిపరచటంతో పాటు రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావొచ్చన్న ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు తెలుస్తోంది.

### తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన నేత..

2003లో టీఆర్ఎస్ పార్టీలో చేరిన ఈటల రాజేందర్.. 2004లో కమలాపూర్ నుంచి ఉపఎన్నికతో కలిపి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో హుజురాబాద్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత 2010లో జరిగిన ఉపఎన్నికల్లో మరోసారి ఈ స్థానం నుంచే గెలిచి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదారు. ఆ తర్వాత 2014లోనూ టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 లో కేసీఆర్ మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2018 ఎన్నికల తర్వాత ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2021లో టీఆర్ఎస్ అధిష్ఠానానికి తనకు మధ్య వచ్చిన విభేదాలతో పార్టీకి మంత్రి పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఉపఎన్నికలో బీజేపీ తరపున బరిలోకి దిగి.. హుజురాబాద్ నుంచి గెలిచి సంచలనం సృష్టించారు. అటు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ నుంచి పోటీ చేసిన ఈటల.. రెండు చోట్లా ఓడిపోయారు. అయితే.. 2024 లోక్ సభ ఎన్నికల్లో మాత్రం మల్కాజిగిరి నుంచి మొదటిసారి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు.



## ఏపీ ఎన్నికల ప్రణాళికలో ఉచిత బస్సు

### హామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారోనని సోషల్ మీడియాల్లో చర్చలు

**విశ్వంభర, హైదరాబాద్** : ఏపీ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతకు తోడు.. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు సైతం ప్రభావం చూపించాయి. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరిట టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించింది. ఇక అధికారంలోకి రావటంతో హామీల అమలు ఎప్పటి నుంచి అనే చర్చ నడుస్తోంది. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలలో ప్రధానమైనది.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. ఢిల్లీ, కర్నాటక, తెలంగాణలో సూపర్ సక్సెస్ అయిన ఈ హామీని.. టీడీపీ కూడా తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చింది.

టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కానున్న నేపథ్యంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారనే చర్చ నడుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తొలుత అమలు చేసిన హామీ ఇదే. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని మొదటగా అమలు చేస్తారనే వార్తలు వస్తున్నాయి. అయితే తెలంగాణతో పోలిస్తే ఏపీలో కొన్ని పరిమితులు ఉండొచ్చనే ప్రచారం నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో అన్నిరకాల పాస్‌లు కలిగిన వారు సుమారుగా పది లక్షల మంది ఉండొచ్చని అంచనా. వీరిలో దాదాపుగా 3 నుంచి 4 లక్షల మంది వరకూ మహిళలు, విద్యార్థినులు ఉండొచ్చని సమాచారం. ఈ నేప లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తే రోజుకు రూ.6 కోట్ల వరకూ ఆదాయం తగ్గుతుందని అంచనా.అయితే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే మంత్రివర్గం ఏర్పాటైన తర్వాత, మంత్రిమండలి సమావేశంలో ఏ హామీలు అమలు చేస్తారనే దానిపై క్లారిటీ రానుంది. మంత్రిమండలి సమావేశం తర్వాత ఏయే పథకాలను తొలుత అమలు చేయాలనే దానిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. తెలంగాణలో పోలిస్తే కొన్ని పరిమితులతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఏపీలో అమలు చేయవచ్చంటూ సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. కొంతమంది దీనికి సంబంధించి ట్వీట్లు పెడుతున్నారు.

తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా న డిచే అన్ని ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బ స్సుల్లో ఈ పథకాన్ని అమలు చేస్తు న్నారు. అయితే ఏపీలో జిల్లా సర్వీసులకే ఈ పథకాన్ని పరిమితం చేస్తారని సోష ల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. అంతర జిల్లాలలో తిరిగే ఎక్స్ ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలుచేస్తారని కొంతమంది నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. దీనిపై చంద్రబాబు ముందే క్లారిటీ ఇచ్చారంటూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు.



## ప్రశాంతంగా గ్రూప్ -1 ప్రిలిమ్స్

- 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- 4.03 మంది అభ్యర్థులు దరఖాస్తు
- రాష్ట్ర వ్యాప్తంగా 897 పరీక్షా కేంద్రాలు
- అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- గతంలో రెండు సార్లు రద్దైన గ్రూప్-1
- కొత్తగా 60 పోస్టుల భర్తీకి రేవంత్ సర్కార్ ఆమోదం

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 563 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ఈ పరీక్ష ప్రశాంతంగా సాగింది. ఉదయం 10 గంటల వరకే అనుమతిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించటంతో అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 31 జిల్లాల్లో 897 పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంతంగా సాగింది. కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద కొందరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో నిరాశతో వెనుదిరిగారు. ఒక్క నిమిషం నిబంధన పెట్టింది. ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ బృందంతో పాటు 3 నుంచి 5 కేంద్రాలకు ఓ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశారు.

### గతంలో రెండు సార్లు రద్దు

అయితే గత ప్రభుత్వంలో గ్రూప్–1 పరీక్ష రెండు సార్లు రద్దు అవ్వగా.. ఎట్టకేలకు ఆదివారం జరిగింది. తొలిసారిగా 2022 ఏప్రిల్‌లో గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత అదే ఏడాది అక్టోబర్‌లో ప్రిలిమ్స్ నిర్వహించి మెయిన్ పరీక్షలకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో ఆ పరీక్షను కమిషన్ రద్దు చేసింది. ఆ తర్వాత గతేడాది జూన్ 11న రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహించగా నిర్వహణ ప్రక్రియలో లోపాలు జరిగాయంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ సమయంలో పరీక్షను రద్దు చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం కమిషన్‌ను ప్రక్షాళన చేపట్టింది. అదే విధంగా కొత్తగా 60 గ్రూప్–1 పోస్టుల భర్తీకి ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్తగా 563 గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది.

### అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అభ్యర్థుల సౌకర్యార్థం టీజీఆర్టీసీ ఆదివారం ప్రత్యేక బస్సులు నడిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 897 ప రీక్ష కేంద్రాలకు హైదరాబాద్ నుంచి జిల్లాలకు శనివారం సాయంత్రం నుంచే ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్బీ నగర్, ఆరాంఘర్ పాయింట్లనుంచి బస్సులను నడిపించింది.

## అలసత్వం ప్రదర్శించొద్దు..

- పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలి
- అభివృద్ధి పనులను వేగవంతం చేయండి
- మధిర అభివృద్ధిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష



**విశ్వంభర, మధిర:** ఎన్నికల కోడ్ ముగిసింది అధికారులు అభివృద్ధి పనుల వేగవంతం పెంచాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో మధిర అభివృద్ధిపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క.. ఇది ప్రజా ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇచ్చామన్నారు. అధికారుల జవాబుదారీ తనంతో పని చేయాలని తెలిపారు. మధిర అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 25 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా మధిరలో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం 128 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేశారు. అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు నేతలు హాజరయ్యారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

JEE ADVANCED

**విశ్వంభర, హైదరాబాద్ :** జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) అడ్వాన్స్‌డ్–2024 ఫలితాలు విడుదల య్యాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్ ఆదివారం ఉదయం ఫలితాలను ప్రకటించింది. అభ్యర్థులు jeeadv.ac.in వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చు. పేపర్ 1, పేపర్ 2 రెండింటి స్కోర్ కార్డులను చూడవచ్చు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు కనీస కటాఫ్ 93.2 పర్సంటైల్‌గా ఉంది. 2023లో కటాఫ్ పర్సంటైల్ 90.7, 2022లో 88.4గా ఉంది. అయితే, ఈసారి కటాఫ్ పర్సంటైల్ ఎక్కువగా ఉంది. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోటి 360 మార్కులకు 355 సాధించి కామన్ ర్యాంక్ లిస్ట్(సీఆర్ఎల్)లో టాపర్‌గా నిలిచాడు. ఇక ఐఐటీ బాంబే జోన్‌కు చెందిన ద్విజా ధర్మేశ్ కుమార్ పటేల్ 360 మార్కులకు 332 సాధించి సీఆర్ఎల్–7తో టాప్ మహిళా ర్యాంకర్‌గా నిలిచింది. ఈ మేరకు కామన్ ర్యాంక్ లిస్ట్, కేటగిరీ ర్యాంకుల జాబితాను ఐఐటీ మద్రాస్ విడుదల చేసింది. కాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 26, 2024న దేశవ్యాప్తంగా రెండు సెషన్‌లలో జరిగింది. జూన్ 2న ఆన్సర్ కీ విడుదలైంది. టాప్ 2.5 లక్షల మంది విద్యార్థులు మాత్రమే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ మార్కులు గణనీయంగా పెరిగాయి.



# నకిలీ ఆధార్ కార్డులతో లోన్లు.. అమాయకులకు టోకరా

**విశ్వంభర, నల్లగొండ :** వీళ్లంతా సాఫ్ట్ వేర్ ఉద్యోగులు. ఈజీ మనీ కోసం అలవాటు పడ్డారు. అమాయకుల ఆధార్ కార్డులను సేకరించి సాఫ్ట్ వేర్ నైపుణ్యంతో ఫోటోలు, అడ్రస్‌లు మార్చేశారు. ఖాతాలో ఓపెన్ చేసి రుణాలు పొంది బ్యాంకులనే బురిడీ కొట్టించారు. ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కి అడ్డంగా బుక్కయ్యారు. చివరికి కటకటాల పాలయ్యారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామానికి చెందిన కాశమల్ల క్రాంతికుమార్ ఎంబీఏ చదివి హైదరాబాద్ స్వయంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పాడు. నష్టాలు రావడంతో మూసేశాడు. అదే కంపెనీలో పనిచేసిన సిలివేరు సతీష్‌తో కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించే ఈజీ మనీ కోసం కొత్త దందాకు తెరలేపారు. నల్లగొండలోని సతీష్ బాబాయ్.. కాశమల్ల నాగరాజుకు కొంత డబ్బు ఇస్తామని చెప్పడంతో అతని ద్వారా తెలిసిన వారి ఆధార్ కార్డులు సేకరించారు.



**బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులతో లోన్స్..**

సేకరించిన ఆధార్‌కార్డుల సహాయంతో క్రాంతి కుమార్.. టెక్నాలజీతో పాన్‌కార్డులు, కొత్త సిమ్ కార్డులు తీసుకుని ఫోన్ నంబర్లకు లింక్ చేసి చిరు నామాలు మార్చేశాడు. వాటితో వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి పాసు పుస్తకాలు, చెక్ బుక్‌లు, ఏటీఎం కార్డులు తీసుకున్నాడు. నగదు లావాదేవీలు జరిపి సిబిల్ స్కోర్ పెంచుకుని క్రెడిట్ కార్డులతో లోన్స్ తీసుకొని జల్సాలు చేశారు. తీసుకున్న రుణం బ్యాంక్‌లకు తిరిగి చెల్లించకుండా మోసం చేసేవారు. దీంతో బ్యాంకులు అమాయకులైన ఆధార్ కార్డు దారులను రుణాలు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడంతో అసలు బాగోతం బయట పడింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ముగ్గురు కేటుగాళ్లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 27 ఆధార్ కార్డులు, రూ.1,32,600 నగదు, 44 సెల్‌ఫోన్లు, 2 కార్లు, 83 పాన్ కార్డులు, 18 సిమ్ కార్డులు, 92 డెబిట్ కార్డులు, 64 రబ్బర్ స్టాంపులు, 3 ల్యాప్ టాప్‌లు, కలర్ ప్రింటర్ స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ చందన దీప్తి తెలిపారు.

# రైతుబంధు పెంచి ఇవ్వాలి

## మాజీ మంత్రి హరీశ్‌రావు

**విశ్వంభర, సిద్దిపేట:** రైతులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలం అయ్యారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాన చినుకు పడితే రైతు బంధు పైసలు పడేవి. ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న అని అన్నారు. షరతులు లేకుండా ఎకరాకు రూ. 7500 ఇవ్వాలి. ప్రసంగాల్లో, మ్యానిఫెస్టోలో పంట కాలానికి ముందే ప్రతి ఎకరాకు ఇస్తామని చెప్పి చెప్పారు.ఇప్పుడు రైతులను మోసం చేయడం సరికాదు.పంట ప్రారంభం అయ్యింది. విత్తనాలు వేస్తున్నారు. రైతు భరోసా వేయడం లేదు. కెసిఅర్ బస్సు వేసుకొని అడిగితే రైతు బంధు కొందరికి వేశారు.ప్రజా సమస్యల మీద, రైతు సమస్యల మీద దృష్టి సారించాలి.జనుము, జీలుగ విత్తనాలు కొరత ఉంది. సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యింది.కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్న చూపు చూస్తున్నది.ఎరువులు కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.ఎన్నికలకు ముందు అన్ని పంటలకు 500 బోనస్ అని, ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తమంటున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి .రైతులను దగా చేయడం మంచిది కాదు.అసెంబ్లీ సమావేశాల్లో అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని బి ఆర్ ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుంది.



# తెలంగాణ కాషాయ దళపతికి పట్టం

**విశ్వంభర, హైదరాబాద్, జూన్ 9:** ఆయనొక సాధారణ ప్రభుత్వ ఉపాధ్యాయుని కుమారుడు.. ఆయన ప్రస్థానం ఏబీవీపీ నాయకుడిగా మొదలై.. నేడు కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగాడు. మూడోసారి ప్రధాన మంత్రి అవుతోన్న నరేంద్ర మోదీ కేబినెట్‌లో స్థానం సంపాదించుకున్నాడు. ఆయనే కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బండి సంజయ్ కుమార్.

**మోదీ టీం మెంబర్‌గా..**

దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరిస్తున్నారు. అయితే.. ఈసారి మోదీ ప్రభుత్వంలో తెలుగు రాష్ట్రాల ఎంపీలకు తగిన ప్రాముఖ్యత ఇస్తున్నట్టు తెలుస్తోంది. మోదీతో పాటు సుమారు 70 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ జాబితాలో తెలంగాణ నుంచి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మరోసారి అవకాశం కల్పిస్తుండగా.. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు కూడా మోదీ జట్టులో ఛాన్స్ దక్కింది. ఈ నేపథ్యంలో.. ఏబీవీపీ నాయకుడి నుంచి కేంద్ర మంత్రిగా బండి సంజయ్ ఎదిగిన తీరును బీజేపీ శ్రేణులు గుర్తు చేసుకుంటున్నారు. సంజయ్ కు ఈ గౌరవం ఊరికే రాలేదు.. ఆయన రాజకీయ ప్రయాణం.. ప్రజా క్షేత్రంలో నిత్యం ఒక యుద్ధంలానే సాగింది.

**కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రి వరకు..**

తెలంగాణ బీజేపీ కీలక నేతల్లో ఒకరిగా ఎదిగిన సంజయ్.. 1971 జులై 11న శకుంతల, నర్సయ్య దంపతులకు జన్మించారు. సంజయ్ తండ్రి ఒక గవర్నమెంట్ టీచర్‌గా పని చేసేవారు. సరస్వతి శిశుమందిర్‌లో విద్యాభ్యాసం చేసిన బండి సంజయ్.. చిన్నప్పటి నుంచే ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆర్ఎస్ఎస్‌లో ఘటన్ నాయక్‌గా, ముఖ్య శిక్షక్‌గా ప్రాథమిక విద్యా స్థాయిలోనే పనిచేశారు.

అనంతరం.. ఏబీవీపీ కరీంనగర్ పట్టణ కన్వీనర్‌గా, పట్టణ ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బండి సంజయ్ బాధ్యతలు నిర్వర్తించారు. 19942003 మధ్యకాలంలో "ది కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్" డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. బీజేపీలో వివిధ హోదాల్లో సంజయ్ పని చేశారు. భారతీయ జనతా పార్టీ కేరళ, తమిళనాడు రాష్ట్రాల ఇంఛార్జ్‌గానూ పని చేశారు. ఎల్‌కే అద్వానీ చేపట్టిన రథ యాత్రలోనూ భాగం పంచుకున్న సంజయ్.. 35 రోజుల పాటు దేశవ్యాప్తంగా ప్రచారం చేశారు.

2005లో కరీంనగర్ 48వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా బండి సంజయ్ తొలి విజయం సాధించారు. వరుసగా మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరపున కరీంనగర్ ఎంపీగా పోటీ చేసిన సంజయ్.. టీఆర్ఎస్ అభ్యర్థి బి.వినోద్ కుమార్‌పై 89,508 ఓట్ల తేడాతో విజయం సాధించారు. దీంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. రెండుసార్లు కరీంనగర్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన సంజయ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 3,163 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ మూడుసార్లు టీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో బండి సంజయ్ ఓడిపోయారు.



**తెలంగాణపై బీజేపీ అధిష్ఠానం స్పెషల్ ఫోకస్..**

బీసీలను ఆకర్షించే వ్యూహంలో భాగంగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌ను 2020 మార్చిలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నియమించింది. బండి సంజయ్ సారథ్యంలో తెలంగాణలో బీజేపీ పుంజుకుంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కమలం పార్టీ మెరుగైన ఫలితాలు సాధించింది. "ప్రజా సంగ్రామ యాత్ర" పేరిట సంజయ్ తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, ప్రజలతో మమేకమయ్యారు. జనం కష్టాలు తెలుసుకుంటూ.. సంచలనం సృష్టించిన అంశాలపై అధికార పార్టీపై తీవ్ర స్థాయిలో తన గళాన్ని వినిపించారు.

సంజయ్ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. అయితే.. పార్టీ పరమైన నిర్ణయాల్లో భాగంగా.. 2023 జులై 4న బీజేపీ అధిష్ఠానం ఆయన స్థానంలో కిషన్ రెడ్డికి తెలంగాణ పార్టీ పగ్గాలను అప్పగించింది. ఆ తర్వాత సంజయ్‌ను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ప్రజా సమస్యలపై పోరాడి రెండు సార్లు జైలుకు వెళ్లిన ఘనత కూడా బండి సంజయ్ దే.

**దాడులు జరిగినా వెనకడుగు వేయలే..**

ఎంపీ బండి సంజయ్ కు కేంద్ర మంత్రి పదవి దక్కడంపట్ల తెలంగాణలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బండి సంజయ్ ను తెలంగాణ కాషాయ దళపతిగా పిలుచుకునే బీజేపీ కార్యకర్తల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. రైతులకు భరోసా ఇచ్చేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాల వద్దకు వెళుతుంటే నాటి అధికార పార్టీ మూకలు రాళ్లదాడికి తెగబడినా వెనుకంజ వేయలేదు. వారిని దీటుగా ఎదుర్కొని రైతులకు అండగా నిలిచి, రైతుల పక్షాన అనేక దీక్షలు చేపట్టారు. నిరుద్యోగ మార్చ్ పేరుతో జిల్లాల వారీగా నిరసన కార్యక్రమాలతో నిరుద్యోగుల పక్షాన పోరాడారు. బండి సంజయ్ పోరాటాలతో బెంబేలెత్తిన నాటి కేసీఆర్ సర్కార్ టెన్త్ హిందీ పేపర్ లీకేజీ కేసులో అర్ధరాత్రి పోలీసులను ఇంటికి పంపి అక్రమంగా అరెస్ట్ చేసినా వెనుకంజ వేయకుండా ఉద్యమించి కాషాయ పార్టీ పోరాట పటిమను చాటి చెప్పారు. 317 జీవోను సవరించాలని ఉద్యోగుల పక్షాన పోరాడి సర్కార్ ను గడగడలాడించిన ఘనత కూడా సంజయ్ దే. సంజయ్ ధాటికి తట్టుకోలేని నాటి బీఆర్ ఎస్ పాలకులు కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో దీక్ష చేస్తుండగా పోలీసులను పంపి గ్యాస్ కట్టర్లతో ఆఫీస్ గేట్లను ధ్వంసం చేయించి బండి సంజయ్ ను అరెస్ట్ చేసి భవిష్యత్తులో దీక్షలు చేయకుండా బీజేపీని కట్టడి చేయాలని చూశారు. అయినా వెరవని సంజయ్ కేసీఆర్ సర్కార్ పై చురుకైన పాత్ర పోషించారు.

**స్టార్ క్యాంపెయినర్‌గా..**

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో.. బీజేపీ జాతీయ నాయకత్వం స్టార్ క్యాంపెయినర్‌గా బండి సంజయ్‌ను నియమించింది. 40 మందితో కూడిన జాబితాను ఆ పార్టీ అక్టోబర్ 19న ప్రకటించగా.. తెలుగు రాష్ట్రాల నుంచి స్టార్ క్యాంపెయినర్‌గా బండి సంజయ్‌కి మాత్రమే చోటు దక్కింది. 2024 జనవరి 3న కిసాన్ మోర్చా జాతీయ ఇంఛార్జిగా నియమితులయ్యారు.

ఇక.. 2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మళ్లీ కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి బరిలో దిగి.. 2,25,209 మెజార్టీతో భారీ విజయాన్ని సాధించారు. కరీంనగర్‌కు వరుసగా రెండోసారి ఎంపీగా గెలిచి సత్తా చాటారు. దీంతో.. మోదీ జట్టులో స్థానం సంపాదించుకున్నారు బండి సంజయ్.

**బండి సంజయ్ భార్య, కొడుకు డ్యాన్స్**

బండి సంజయ్ మొదటిసారి కేంద్రమంత్రి కాబోతున్నారు. దాంతో ఆయన కుటుంబంలో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. బండికి కేంద్రమంత్రి పదవి దక్కిన వెంటనే కరీంనగర్ లోని ఆయన ఇంట్లో ఆయన భార్య అపర్ణ, ఆయన కొడుకు భగీరథతో పాటు కుటుంబ సభ్యులు సంతోషంతో డ్యాన్స్ వేశారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ.. మా జీవితాల్లో ఇదో అత్యుత్తమ క్షణం అంటూ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అందరి కృషి, ప్రార్థనల వల్లే మనం ఇక్కడకు వచ్చాం. బండి సంజయ్ ఇంత పెద్ద పొజిషన్ లోకి రావడం నిజంగా మా అందరి అదృష్టం అంటూ ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# జగన్ ఫ్యామిలీ అంతా కలిసిపోవాలి.. పూనమ్ కౌర్ సంచలన ట్వీట్..!

**విశ్వంభర, హైదరాబాద్ :** పూనమ్ కౌర్ పేరు ఎప్పటికప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అవుతూనే ఉంటుంది. ఆమె పేరుకు అటు ఇండస్ట్రీలో ఇటు రాజకీయాల్లో ఎప్పటికప్పుడు పాపులర్ అవుతూనే ఉంటుందని చెప్పుకోవాలి. అయితే మొన్న వైసీపీ పార్టీ ఓడిపోయి టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆమె ఓ ట్వీట్ పెట్టారు.


వై నాట్ 175 ను ప్రజలు సీరియస్‌గా తీసుకున్నారంటూ ఆమె ట్వీట్ చేశారు. దాని తర్వాత ఆమె మరో ట్వీట్ చేశారు. టీడీపీ కూటమి సుగాలి ప్రీతి కేసును త్వరగా పరిష్కరించాలంటూ ఆమె కోరారు. ఇదిలా ఉండగా ఇప్పుడు జగన్ కుటుంబాన్ని ఉద్దేశించి ఆమె సంచలన ట్వీట్ చేశారు.





జగన్ ఫ్యామిలీ అంతా కలిసి ఉండాలని కోరుకుంటున్నానని.. వారి కుటుంబం మరింత బలోపేతం కావాలని ఆమె ట్వీట్ లో రాసుకొచ్చారు. గత ఎన్నికల్లో జగన్ గెలుపులో భార్య భారతి, తల్లి విజయమ్మ, సోదరి షర్మిలది కీలకపాత్ర. వారంతా మరోసారి కలిసికట్టుగా ఉండాలని కోరుకుంటున్నాను అంటూ ఆమె తెలిపారు. అయితే ఆమె ట్వీట్ మీద నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు.

# హైదరాబాద్ వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు యాక్షన్ ప్లాన్ రెడీ



**విశ్వంభర, హైదరాబాద్ :** చినుకు పడితే చిత్తడే. వాన పడితే వణుకే. ఇదీ హైదరాబాద్ వాసుల దుస్థితి. వర్షాకాలం వచ్చిందంటే నగర వాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆఫీస్ నుంచి ఇంటికెళ్లాలంటే నరకమే. ట్రాఫిక్‌లో గంటల తరబడి చిక్కుకోవాల్సిన పరిస్థితి. ఈ సమస్యకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం సంకల్పించింది. వానకాలం వర్రీకి చెక్‌పెట్టేలా ప్రణాళికను రూపొందించింది. ఈసారి వానకాలం కష్టాలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది జీహెచ్ఎంసీ. ప్రత్యేకంగా 542 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసింది. అందులో మొబైల్ 157, స్టాటిక్ 242 బృందాలు, సీఆర్ఎంపీ రోడ్లపై 29, డిఆర్ఎఫ్ 30 బృందాలు, పోలీస్ శాఖ 13 బృందాలు, విద్యుత్ శాఖ 41, వాటర్ వర్క్స్ 22 బృందాలను ఏర్పాటు చేసింది. సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. నగర వ్యాప్యంగా 125 వరద బాధిత ప్రాంతాలున్నాయి. వాటిని దశలవారీగా తగ్గిస్తూ శాశ్వత పరిష్కారం చూపారు అధికారులు. నాలాల్లో ప్రజలు చెత్త, వ్యర్థాలు వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వర్షాల సమయంలో నీరు నిలిచే ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టారు. నీళ్లు నిలిచే పాయింట్ల దగ్గర పెద్ద సంపులను ఏర్పాటు చేసి వరద సమస్యకు చెక్ పెట్టారు. విపత్తు సమయాల్లో అత్యవసర సహాయం కోసం ప్రత్యేకంగా నంబర్లు ఏర్పాటు చేసింది.

# పరీక్షా కేంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీ

**విశ్వంభర, సూర్యాపేట:** గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ నేపథ్యంలో స్థానిక ఏ.వి.ఎం ఉన్నత పాఠశాల, సిద్ధార్థ హైస్కూల్ అలాగే స్పందన డిగ్రీ అండ్ పి.జి కళాశాలను అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేటలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినామని అన్నారు. కేంద్రాల్లో బయో మెట్రిక్, హాజరు శాతం, గైర్హాజరు వివరాలు అలాగే మెడికల్ స్టాల్స్ ను, అభ్యర్థుల పరీక్షా నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సి.ఈ. ఓ శిరీష, జిల్లా అధికారులు, సెక్టార్ అధికారులు, చీఫ్ సూపర్డెంట్లు , అబ్జర్వర్లు, పాల్గొన్నారు.



# సాధువులపై దూసుకెళ్లిన డీసీఎం.. ముగ్గురు దుర్మణం

**విశ్వంభర, వనపర్తి :** వనపర్తి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సాధువులపైకి ఓ డీసీఎం దూసుకెళ్లింది. పెబ్బేరు మండలం రంగాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనలో ముగ్గురు సాధువులు మృతి చెందారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు నుంచి కర్నూలు వైపు గుజరాత్‌కు చెందిన సాధువుల బృందం నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం అటుగా వెళ్తున్న ఓ డీసీఎం వాహనం వారిని కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి 108కు ఫోన్ చేయగా వారిని ఆస్పత్రికి తరలించారు. మరో క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

# గాజాపై ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపివేయాలి

## ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్

**విశ్వంభర, సూర్యాపేట:** పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానుషమైన రాక్షస దాడిని ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయని అయినప్పటికీ, ఇప్పటికీ "గాజా" మీద దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ చర్యలను అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మబిక్షం భవనంలో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత కొంతకాలంగా "గాజా" లో హమాస్ తీవ్రవాదం పేరుతో ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని ఐక్యరాజ్యసమితి నిర్ణయాన్ని తుంగలో తొక్కి పాలస్తీన దేశాన్ని లేకుండా చేయాలని అందులో భాగంగా "గాజా" గొంతును కోస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. పాఠశాలల మీద దవఖానాల మీద పునరావాస కేంద్రాల మీద ఎక్కడబడితే అక్కడ నిర్దాక్షకంగా బాంబులతో రాకెట్స్ తో యుద్ధ ట్యాంకులతో ఇజ్రాయిల్ దాడి చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి ఫలితంగా వేలాదిమంది విద్యార్థులు మృత్యువాత పడ్డారని, పెద్ద సంఖ్యలో ప్రజలు క్షతగాత్రులయ్యారని, వారికి వైద్యం అందక ఆకలి దప్పికలు తీరే అవకాశం లేక యావత్తు "గాజా" గడగడలాడుతుందని కేవీఎల్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఐరాస శరణార్థి శిబిరం నడుస్తున్న స్కూల్ పై ఇజ్రాయిల్ ఆర్మీ దాడులు నిర్వహించారని ఆ దాడుల్లో 33 మంది చనిపోయారని ఇతర చోట్ల ఉన్న శిబిరాలపై జరిపిన దాడుల్లో మరి కొంతమంది చనిపోయారని ఇది మానవత్వానికి మచ్చ లాంటిదన్నారు. ఐక్యరాజ్యసమితి సూచనలను కూడా లెక్కచేయకుండా ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ఈ దాడులను ఆపకపోతే భవిష్యత్తులో ప్రపంచం దేశాలు ప్రమాదపు అంచుల్లోకి నెట్టేయబడుతుందని, ప్రపంచ యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సూర్యాపేట ఐప్సో అధ్యక్షులు తొగటి మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గోపగాని రవి, బూర సైదులు, తదితరులు పాల్గొన్నారు.




# అక్షర యోధుడు రామోజీరావు

## సూర్యాపేటలో సంతాపం తెలిపిన జర్నలిస్టులు



**విశ్వంభర, సూర్యాపేట జూన్ 09 :** ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు అకాల మరణం పత్రికా రంగానికి తీరని లోటని వివిధ హోదాల్లో పని చేస్తున్న సూర్యాపేట జర్నలిస్టులు అన్నారు. ఆయన మృతి పట్ల ఆదివారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ బహు ముఖ ప్రజ్ఞాశాలిగా రామోజీరావు గుర్తింపు పొందారని అన్నారు. ఆయన ఏర్పాటు చేసిన అనేక సంస్థల్లో ఎంతో మందికి ఉపాధి కల్పించారని కొనియాడారు. సంతాపం ప్రకటించిన వారిలో వజ్జే వీరయ్య యాదవ్,గుండా శ్రీనివాస్ గుప్తా, చల్లా చంద్రశేఖర్, బంటు కృష్ణ, బుక్క రాంబాబు, ఊటుకూరి రవీందర్, రాపర్తి మహేష్, కందుకూరి యాదగిరి, బత్తుల మారయ్య, బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయ్, గుణగంటి సురేష్, నజీర్, వెంకటయ్య, గట్టు అశోక్, శ్రీనివాస్, నాగేందర్, బ్రహ్మచారి, సైదులు, శంకర్, శ్రవణ్, రామాచారి తదితరులు ఉన్నారు.

# నేడు సీఎం చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు





**విశ్వంభర, హైదరాబాద్:** వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ, టీ హబ్, అసెంబ్లీ సందర్శించడం జరిగింది. నేడు ఆ విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అవార్డుల ప్రధానం జరగనుంది.





## ప్రముఖ నేత నాగిళ్ళ గోపాల్ గుప్తా ఔదార్యం

## పేద విద్యార్థికి రూ. 35 వేల ఆర్థిక సాయం

**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 9** : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కోండన్న గూడ గ్రామానికి చెందిన నాగి సాయిలు కుమారుడు సిద్ధిపేటలోని ఆర్వీఎం కాలేజిలో ఎంబీబీఎస్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. నాగి సాయిలు పేదవాడు కావగంతో ఎంబీబీఎస్ ఫీజు కోసం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదేపల్లి సిద్దార్థ ఆధ్వర్యంలో విద్యార్థి స్థితిగతులు షాద్‌నగర్ ప్రముఖ సీనియర్ నేత, వ్యాపార వేత్త నాగిళ్ళ గోపాల్ గుప్తాకు వివరించడం జరిగింది. దీంతో వెంటనే స్పందించిన నాగిళ్ళ గోపాల్ గుప్తా రూ.35,000లు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాగిళ్ళ గోపాల్ గుప్తాకు విద్యార్థి తండ్రి నాగి సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా నాగిళ్ళ గోపాల్ గుప్తా పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు.

## పండుగలు సంస్కృతిక జీవన విధానానికి ప్రతిబింబాలు

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**



విశ్వంభర, నారాయణపూర్ జూన్ 9: తెలంగాణ రాష్ట్రంలో పల్లెల్లో జరుపుకునే ప్రతి పండుగకు ఒక ప్రత్యేక స్థానం ఉంటుందని పండుగలు మన సంప్రదాయాలు ఆచారాలకు నిలయాలని, పండుగలు సాంస్కృతిక జీవన విధానానికి ప్రతిబింబాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం సంస్థాన్ నారాయణపూర్ మండలం కొత్తగూడెం గ్రామంలో జరిగిన ముత్యాలమ్మ, ఈదమ్మ పండుగలో పాల్గొని గ్రామదేవతలకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఐక్యమత్యంగా సోదరా భావంతో మేలుకొలుపు జాతిని జాగృత పరచడానికి గుడులు ఒక వేదికగా మారడం చాలా సంతోషకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పండుగలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని పండుగల ద్వారా తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కట్టుబాట్లను అలవాట్లను ముందు తరాలకు అందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నరసింహ, బీసీ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వీరమల్ల కార్తీక్ గౌడ్, బీసీ సంఘం నాయకులు బర్ల పాండు కురుమ, గురుజ నరసింహాగౌడ్, వరికుప్పల మధు, సింగం కృష్ణ, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కారు బైక్ ఢీ ఒకరి మృతి



**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 9:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కేంద్రంలోని దర్గా సమీపంలో హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న కారు బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడిపిస్తున్న మహాత్మా గాంధీ తండాకు చెందిన రాత్లావత్ మంగ్య( 32) అక్కడికక్కడే మరణించాడు. మృతుడు హైదరాబాద్‌లో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు రాత్లావత్ మంగ్యకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటా కన్వెన్షన్‌లో పాలమూరు ప్రవాసభారతీయుల ప్రత్యేక సమావేశం




**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 9:** అమెరికా అట్లాంటా వేదికగా అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 18వ ఆటా 2024 వేడుకల్లో రెండవ రోజు పలు ఆసక్తికరమైన సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు రాష్ట్ర సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. ఆటా ప్రతినిధి కిషోర్ గూడూరు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బిజినెస్ ఫోరం మరియు పొలిటికల్ అఫైర్స్ సమావేశంలో అమెరికా ప్రవాసభారతీయులతో కలిసి ఆయన పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఉమ్మడి పాలమూరు అభివృద్ధి మరియు అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలకు సంబంధించిన పలు అంశాలను చర్చించినట్లు తెలిపారు. పాలమూరు ప్రవాస భారతీయులు మరియు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పాలమూరు ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిలు సమిష్టిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా ప్రత్యేక నిధులు సమకూర్చి పాలమూరును అభివృద్ధి పదంలో ముందుంచాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యా వ్యవస్థలో మరియు సంక్షేమ కార్యక్రమాలలో ఎన్ఆర్ఐలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సోదరుడు జగదీశ్వర్ రెడ్డి, భరత్, నర్సింహా రెడ్డి ధ్యాసాని, సాయి సూదిని, సుభాష్ కట్టెగుమ్మల, రామకృష్ణ అలె, లక్ష్మణ్ గూడూరు తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై కోపంతో ఇంటికి నిప్పు పెట్టిన భర్త..



**విశ్వంభర, సిరిసిల్ల**: భార్యపై కోపంతో భర్త ఇల్లును తగులబెట్టాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మనగర్‌కు చెందిన ముదారి బాలపోశయ్య అనే మత్స్యకారుడు ఇంటివద్ద చేపలు అమ్ముతూ, ఫ్రై చేసి విక్రయించేవాడు. భార్య రాజేశ్వరీతో కలిసి జీవిస్తున్నాడు. కాగా శనివారం మృగశిరకార్తే కావడంతో ఉదయం బయటకు వెళ్లి పీకల దాక మద్యం సేవించాడు. సాయంత్రం ఇంటికి రావడతో దంపతులకిద్దరి మధ్య గొడవ జరిగింది. ఇద్దరి మధ్యన మాట మాట పెరిగి కోపోద్రిక్తుడైన బాలపోశయ్య మద్యం మత్తులో భార్య రాజేశ్వరిపై కిరోసిన్ పోశాడు. రాజేశ్వరి తేరుకొని కిరోసిన్ డబ్బాను భర్త నుండి లాక్కొని పక్కన విసిరేయడంతో ఇల్లంతా కిరోసిన్ పారింది. ఇదే సమయంలో అగ్గిపెట్టె తీసుకొని ఇంటిలో నిప్పంటించాడు భర్త. గమనించిన భార్య రాజేశ్వరీ ప్రాణభయంతో కేకలు వేస్తూ బయటకు పరుగెత్తింది. ఒక్కసారిగా ఇల్లంతా మంటలు వ్యాప్తించడంతో ఆ వేడి తట్టుకోలేక బాలపోశయ్య కూడా బయటకు పరుగులు తీశాడు. అక్కడ ఉన్న స్థానికులకు ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించడంతో సిరిసిల్ల నుండి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అదే క్రమంలో ఇంట్లో మూడు సిలిండర్ ఉన్నాయని ఫైర్ సిబ్బంది చెప్పడంతో ముందస్తుగా సిలిండర్లను బయటకు తీశారు. దీంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నాను. ఇంటి బయట నిలిపిన ద్విచక్రవాహనానికి మంటలు వ్యాపించడంతో పూర్తిగా కాలిపోయింది. అంతేకాకుండా మంటలు పక్కింటికి వ్యాపించి వారి ఇల్లు కూడా పూర్తిగా కాలిపోయింది. అప్పటికే మంటల వేడికి పెంకుటిల్లు కాలి, కూలింది. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెట్టుగూడా చౌరస్తాలో బీజేపీ శ్రేణుల సంబురాలు



**విశ్వంభర, బషీర్‌బాగ్ జూన్ 09 :** భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ముచ్చటగా మూడవసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రిగా గంగాపురం కిషన్ రెడ్డి రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మెట్టుగూడా చౌరస్తాలో బీజేపీ ఓబీసీ మోర్చా ఎంబీసీ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ మల్లేశ్వరపు ఆధ్వర్యంలో టాపాకులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ భారతదేశంలో సుస్థిర పాలన అందించి దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే కాకుండా అవినీతి రహిత పాలన అందించిన మోడీ 2047 వరకు భారతదేశం అభివృద్ధి చెందిన దేశాంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యంగా పాలన చేస్తున్నారని అన్నారు. అందుకే భారతదేశ ప్రజలు మొట్టమొదటి దేశ ప్రధాని నెహ్రూ గారి రికార్డును చెరిపి వేసి నరేంద్ర మోడీ నాయకత్వం అని బలపరచారని అన్నారు. గతంలో ఆర్థిక అభివృద్ధిలో 11వ స్థానంలో ఉన్న దేశాన్ని ఐదవ స్థానానికి తీసుకు వచ్చిన ఘనత నరేంద్ర మోడీదేనన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో మూడో స్థానానికి ఎదుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. 2014 నుంచి 2024 వరకు మూడు సార్లు జరిగిన పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా 42స్థానాలు, 52స్థానాలు, 99 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ బీజేపీకి 2024లో సొంతంగా 241 సీట్లు వస్తే లెక్కలు తెలియనట్టుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడడం విడ్డురంగ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు శ్రీధర్ గుప్తా, నీలం మహేందర్, గండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధనం దుర్వినియోగంపై నకిలీ నోట్ కేసునమోదు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ సర్కార్ టీఎస్‌కు బదులు టీజీ మారిస్తే భారీగా ప్రభుత్వ ధనం ఖర్చు చేయాల్సి వస్తుందంటూ ఫేక్‌నోట్‌ను వ్యాప్తి చేస్తున్న వారిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. టీఎస్ నుంచి టీజీగా పేరు మార్పునకు రూ.2,767 కోట్లు ఖర్చవుతాయని సైబర్ కేటుగాళ్లు ఓ ఫేక్‌నోట్‌ను రూపొందించారు. సోషల్ మీడియాలో నకిలీ నోట్ ప్రచారం కావడంపై సర్కార్ సీరియస్ కావడంతో ఈ మేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇలాంటి అసత్యాలు ప్రచారం చేసే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## సిద్ధి వినాయక విగ్రహ పునః ప్రతిష్ఠాపన వేడుక



**విశ్వంభర, మన్సూరాబాద్:** మన్సూరాబాద్ డివిజన్ కామినేని హాస్పిటల్స్ వెనుక శ్రీ సిద్ధి వినాయక ఆలయాన్ని కొత్తగా నిర్మించారు. ప్రశాంత్ నగర్ కాలనీ కమిటీ ఆధ్వరయంలో దీన్ని కట్టించారు. కాగా ఈ ఆలయంలో ఆదివారం ఉదయం 4 గంటలకు శాస్త్రోక్తంగా వినాయకుడి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే శివుడు, శ్రీ సుముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వాముల విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి మన్సూరాబాద్ డివిజన్ లోని భక్తులు అధిక సంఖ్యలో శ్రీ వర సిద్ధి వినాయక స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రశాంత్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాలను భక్తులు స్వీకరించారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**విశ్వంభర, సూర్యాపేట** : 200102 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం జిల్లా కేంద్రం 13వవార్డు, గాంధీ నగర్ పెద్దమ్మ తల్లి పంక్షన్ హాల్ లో జాజిరెడ్డి గూడెం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనంను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో చిన్ననాటి జ్ఞాపకాలు నెమరవేసుకుంటూ వాళ్లకు చదువు చెప్పిన గురువులు దుబ్బాక నర్సింహారెడ్డి, విద్యాసాగర్, సోమయ్య,మహ్మద్ అలీ,రమాదేవి లను ఘనంగా సన్మానించారు. వాళ్లు చదువుకున్న బడి లో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని చాలా ఆనందపడ్డారు.అలాగే గురువులను పూజించడం, మనకు చదువు చెప్పిన గురువులు ఇప్పటికీ మనల్ని మర్చిపోలేరని వాళ్లు కొనియాడారు.ఇలాంటి వేడుకలు ఇంకా ఎన్నో జరుపుకోవాలని స్కూల్లో ఉన్నప్పుడు తమ యొక్క మధుర జ్ఞాపకాలని గుర్తుచేసుకున్నామని . మీరు కూడా తమలాగే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో సలీం,యుగేందర్ రెడ్డి, దొనకొండ యాదయ్య, వేణు, జె.రవి, హరి కృష్ణ, యాదగిరి, వజ్జె శేఖర్, మల్లేష్ యాదవ్, సునీత రెడ్డి, శ్రీలత, కవిత, సంధ్యారాణి, నాగదేవత, నాగమణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్

**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 9:** షాద్‌నగర్ పట్టణంలోని పాత హైవే రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు బాగుంటేనే రవాణ సౌకర్యం మెరుగుపడి అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వెంకట్ రెడ్డి, డీఈ రవీందర్, ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 9:** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం, గొవిందాయిపల్లి గ్రామంలో శేషిగారి శివ గౌడ్, గుండమోని శివ గౌడ్ ఇద్దరు యువకులు ఈ నెల 6వ తేదీన దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గొవిందాయిపల్లి గ్రామంలో రెండు బాధిత కుటుంబాలను పరామర్శించి హత్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకులను కఠిన శిక్షపడేలా తన వంతు కృషి చేస్తానన్నాడు. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ కడ్తాల్ వైస్ ఎంపీపీ ఆనంద్ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)జూన్ 09 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడ బిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలని సంకల్పంతో కళ్యాణలక్ష్మి పథకాలను అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో ఆదివారం మోటాకొండూర్ మండలంలోని 9మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రుస్తాపూర్ ఎంపీటీసీ ధనావత్ మోహన్‌బాబు నాయక్, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, ఏఎస్ఓ, నరసింహ, జూనియర్ అసిస్టెంట్ స్వరూప, మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బృంగి ఆనంద్‌కుమార్ చేయూత



**విశ్వంభర, కల్వకుర్తి జూన్ 9:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీ సంజాపూర్‌కు చెందిన దొడ్ల శ్రీహరి ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు బృంగి ఆనంద్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.8000 ఆర్థిక సహాయం అంజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆ కుటుంబాన్ని అన్నివేళలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిమ్ముల శ్రీకాందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

### పల్లెర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సంఘపాక సతీష్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)జూన్ 09 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం నల్లగొండ వరంగల్ ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలిచిన సందర్భంగా పల్లెర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సంఘపాక సతీష్ వారికి శుభాకాంక్షలు. ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్క పట్టభద్రులకి పేరుపేరునా సతీష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుక పట్టభద్రుల చే ఎన్నుకోబడిన ప్రజా నాయకుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న. విద్యార్థుల, ఉద్యోగస్తుల సమస్యల మీద ఆయన గళాన్ని వినిపించాలని సతీష్ ఆశించాడు.

### పొన్నం ప్రభాకర్‌పై

# అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- పాడి కౌశిక్ రెడ్డి ఆరోపణలు అవాస్తవం
- ఉద్యమ నాయకుడిపై ఉద్యమ ద్రోహి అక్కసు
- రవాణా శాఖ మంత్రిగా పొన్నం సేవలు అద్వితీయం
- టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్



**విశ్వంభర, హుస్నాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేస్తున్నటు ఆరోపణలు అవాస్తవమని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ అన్నారు. రాష్ట్ర రవాణా శాఖలో అక్రమాలు జరుగుతున్నాయని రవాణా శాఖ మంత్రి రోజుకు రూ.50 లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారని పాడి కౌశిక్ రెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేయడం సహించ తగినది కాదని, పాడి కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని దొంత రమేష్ హెచ్చరించారు. లారీ డ్రైవర్లు వారి యొక్క కాల కృత్యాలను తీర్చుకోవడానికి రోడ్డు పక్కన లారీలను నిలుపగా పాడి కౌశిక్ రెడ్డి డ్రైవర్ల పై దౌర్జన్యం చేస్తూ లారీలల్లో అక్రమ రవాణా జరుగుతుందని దానికి పొన్నం బాధ్యులని లారీల డ్రైవర్లపై బెదిరింపులకు పాల్పడటం ఎంత వరకు సమంజసమో కౌశిక్ రెడ్డి జవాబు చెప్పాలన్నారు. నికార్సైన ఉద్యమ నాయకుడిపై ఒక ఉద్యమ ద్రోహి ఇలాంటి ఆరోపణలు చేయడం, అక్కసు వెలిబుచ్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. లారీలో బూడిద ఎన్ని టన్నులు పడుతుందో అవగాహన లేకుండా కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నారని, 32 టన్నుల వాహనంలో 70 టన్నుల బూడిద తరలిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేశారు, 32 టన్నుల లారీలో 32 టన్నుల బూడిద కూడా పట్టదని కౌశిక్ రెడ్డి తెలుసుకోవాలని, 70 టన్నుల బూడిద 32 టన్నుల లారీలో పడుతుందని కౌశిక్ రెడ్డి నిరూపిస్తే మేము దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్ర మంత్రివర్గంలో పొన్నం ప్రభాకర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కౌశిక్‌రెడ్డి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మరొకసారి పొన్నం ప్రభాకర్ పై ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే కౌశిక్ రెడ్డికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సందమల్ల బాబు, బత్తిని రవీందర్ గౌడ్, సందమల్ల నరేష్, దుబాసి బాబు, జంగా అనిల్ కుమార్, దాసరి తిరుపతి

### భవిష్యత్‌లో కిషన్‌రెడ్డి నేతృత్వంలో

## రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి



**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 9:** నరేంద్ర మోడీ మూడో సారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా కేంద్రమంత్రివర్గంలో సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చోటు దక్కింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డిని జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర మంత్రిగా ఎన్నికైన వర్మని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో బీజేపీ బలపడి అధికారంలోకి వస్తుందని శ్రీవర్ధన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిదంగా రాబోయే ఇదేళ్లలో బీజేపీ హయాంలో తెలంగాణలో మరింత అభివృద్ధి జరగబోతుందని, వికాసిత్ భారత్ లక్ష్యంగా మోడీ పాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అముడాపురం నర్సింహాగౌడ్, వంశీకృష్ణ, చెట్ల వెంకటేష్, మఠం ఋషికేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



**విశ్వంభర, చింతపల్లి జూన్ 10:** చింతపల్లి మండల కేంద్రంలో కొలువై మరో షిరిడీగా శ్రీ సాయి సన్నిధి దేవాలయ 17వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా మొదలై ఆదివారం ముగిశాయి. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా భక్తులు వేల సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.



కళ్యాణ వేడుకల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చాశారు. ఆలయ సిబ్బంది వారికీ ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి బాబా చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో భాగంగా మంటపారాధనలు, మూలమంత్ర సంపుటీకరణ సహిత విజయ చాముండేశ్వర హూమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేసి మహా అన్నదాన కార్యక్రమమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ, కోశాధికారి ఊరే కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కోమిరిశెట్టి వెంకటయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ళ శ్రీనివాస్, వేద పండితులు కొడకండ్ల శ్రీరామ్ శరన్ శర్మ, చానగొండ శివకిరణ్ శర్మ, ఆలయ పూజారులు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలిసిన ఉప్పల వెంకటేష్



**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 9:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి జడ్పటీసీ, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మాజీ ముఖ్యమంత్రిచ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారిని ఎర్రవెల్లి ఫాం హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఆయన మాజీ సీఎంను కోరారు.

దానికి కేసీఆర్ సానుకూలంగా స్పందించి ఎల్లవేళలా ప్రజల మధ్యలోనే ఉండి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టిలోకి తీసుకురావాలని నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి మంచి నాయకుడిగా ఎదగాలని ఉప్పల వెంకటేష్‌ను మాజీ సీఎం కేసీఆర్ దీవించారు.

## కొట్ర గ్రామంలో దొంగల హల్ చల్



**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 9:** నాగర్ కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో కోళ్ల ఫారాల వద్ద తాళాలు వేసిన ఇండ్లలో గుర్తుతెలియని వ్యక్తులు మూడు ఇండ్లల్లో చోరీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గ్రామానికి చెందిన అందుగుల బాలచంద్రమ్మ ఇంట్లో రెండు తులాల బంగారం, 10 తులాల వెండి 7500 వేల నగదు చోరీకి గురైంది. మరో ఇంట్లో బీరువా ధ్వంసం చేశారు. పోలేమోని సురేష్ ఇంట్లో సైతం దొంగలు చొరికి పాలు పడినట్టు బాధితులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## తాటి చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

విశ్వంభర, అమనగల్లు జూన్ 9: తాటి చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా మాడ్గుల, మండలం కొలుకులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల వివరాల ప్రకారం ఉడుతల వెంకటయ్య గౌడ్ (46) గీతకార్మికుడు. రోజు మాదిరిగా ఆదివారం సాయంత్రం ఉడుతల వెంకటయ్య గౌడ్ కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కాడు, ఈ క్రమంలో పట్టుతప్పి చెట్టు మీద నుంచి పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ వెంకటయ్య గౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు.



## లంబాడి సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

**విశ్వంభర, దేవరకొండ :** దేవరకొండ స్థానిక ఐబీలో ఆదివారం ఏర్పటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు కేతావత్ బాబురామ్ నాయక్, గిరిజన సంఘాల జేఏసీ నాయకులు అశోక్ రాథోడ్, కొర్ర లకపతి మాట్లాడారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలు, గూడాలను ఎక్కడ కూడా అభివృద్ధి చేయకుండా ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను డబుల్ బెడ్ రూం, కాళేశ్వరానికి కేటాయించుకుంటూ లంబాడి సామాజిక వర్గాన్ని ఆర్థికంగా దెబ్బతీసి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తీవ్ర అన్యాయం చేసిన బీఆర్ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి ఫాం హౌస్ కి పంపిన ఘనత లంబాడి సామాజిక వర్గానిదని పేర్కొన్నారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మంత్రివర్గ విస్తారణలో లంబాడి సామాజిక వర్గానికి మొదటి విడతలో చోటు దక్కకపోవడంలో లంబాడి సామాజిక వర్గం తీవ్ర అసంతృప్తిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన 8 నియోజకవర్గాలు లంబాడి సామాజిక వర్గం ప్రభావితంగా ఉన్న ప్రాంతాలేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లంబాడి సామాజిక వర్గానికి మంత్రి పీఠం కేటాయించి లంబాడి సామాజికానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే గణేశ్‌నాయక్, నాగరాజు, ఈ రమేశ్, నందులాల్, సూర్య, బాలోజీ, రాజు, కిషన్, రాజు పమార్, నరేశ్, అఖిల్, మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### డా. బీఆర్ అంబెడ్కర్, బాబు జగ్జీవన్ రాంల

## విగ్రహా ఆవిష్కరణ



**విశ్వంభర, ఉప్పల్ :** డా. బీఆర్ అంబెడ్కర్, బాబు జగ్జీవన్ రాంల విగ్రహా ఆవిష్కరణ మహోత్సవం ఉప్పల్ నియోజకవర్గం, మల్లాపూర్ ఏనుగుల సర్కిల్ వద్ద అరుంధతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కారిక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, శేఖర్, మాజీ కార్పొరేటర్లుగొల్లిరి అంజయ్య, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, కొత్త రామారావు, విజయ డైరీ మోహన్ మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా చేపూరి సుదర్శన చారి కుమార్తె ఉష శ్రీ అన్నదానం చేశారు.

## ప్రధాని మోదీ ప్రమాణస్వీకారంతో బీజేపీ నాయకుల సంబురాలు

**విశ్వంభర, చింతపల్లి :** నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు టాపాకులు కాల్చి, స్వీట్స్ పెంచుకొని సంబురాలు చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని నరేంద్ర మోదీ విజయతీరాలకు చేర్చారని కొనియాడారు. దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన ఘనత నరేంద్ర మోదీకే దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సముద్రాల నగేశ్, వెన్న శేఖర్, బొడ్డు మహేశ్, నాళ్ళ శివకుమార్, మోర వెంకటరమణ, గజ్జ అభినవ్, పున్న భీమేష్, నల్ల సైదులు, పొట్టుముత్తు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## అజిత్ పవార్‌కు షాక్.. కేంద్ర కేబినెట్ లో దక్కని చోటు..



**విశ్వంభర, నేషనల్ :** ఎన్డీయే కూటమి భారీ మెజార్టీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. అయితే ఈ సారి బీజేపీకి సొంతంగా మెజార్టీ రాక పోవడంతో మిత్ర పక్షాల సాయంతోనే మోడీ మూడోసారి ప్రధాని అయ్యారు. ఈ క్రమంలోనే మిత్ర పక్షాలకు ఈ సారి ఎక్కువ కేంద్రమంత్రి పదవులు కేటాయించింది బీజేపీ. టీడీపీ, జేడీయూ లాంటి పార్టీలకు ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చింది. అయితే కేంద్రంలో మోడీకి సపోర్టుగా ఉంటున్న అజిత్ పవార్ కు మాత్రం షాక్ తగిలింది. ఈ సారి మహారాష్ట్రలో ఎన్డీయే మిత్రపక్షంగా ఉన్న ఎన్సీపీకి లోక్‌సభ ఎన్నికల్లో కేవలం ఒకే సీటులో గెలిచింది. ఆ పార్టీ తరఫున సీనియర్ నేత ప్రఫుల్ పటేల్ గెలిచారు.
ఆయనకు మోడీ కేబినెట్ లో పదవి ఖాయం అని అంతా అనుకున్నారు. కానీ ఆయనకు కేవలం సహాయమంత్రి పదవి దక్కింది. దాంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను గతంలో కేంద్రమంత్రిగా పని చేశానని.. సహాయ మంత్రి ఇవ్వడం అంటే తన స్థాయిని తగ్గించడమే అంటూ తెలిపారు. అయితే భవిష్యత్ లో కచ్చితంగా కేంద్రమంత్రి పదవి ఇస్తామని ఫడ్నవీస్ చెప్పుకొచ్చారు



## మోడీకి మద్దతుగా వారణాసిలో పూజలు

**విశ్వంభర, వారణాసి:** నరేంద్ర మోడీ ప్రధానిగా మూడో సారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, భారతీయ జనతా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారణాసిలో ఆదివారం ఉదయం భారత్ మాతాకీ జై నినాదాలతో మారుమోగింది. మోడీ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు గంగా హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా గంగాహారతి పాటలు పాడుతూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. మోడీ ఇవాళ సాయంత్రం 7.15గంటలకు భారత ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా వారణాసి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా వారణాసిలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ప్రధాని రాక నేపథ్యంలో అధికారులు ముందస్తు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

## మోదీ కేబినెట్లో చోటు... నటుడు సురేశ్ గోపి మరో మైలురాయి



**విశ్వంభర, త్రిస్సూర్:** కేరళలోని త్రిస్సూర్ నుంచి బీజేపీ తరఫున ఎంపీగా గెలిచి రికార్డ్ సృష్టించిన ప్రముఖ నటుడు సురేశ్ గోపి... మోదీ కేబినెట్లో చోటు దక్కించుకోవడం ద్వారా మరో మైలురాయిని అందుకుంటున్నారు. త్రిస్సూర్ నుంచి 75వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. 'త్రిస్సూర్ బీజేపీ అభ్యర్థికి కేంద్రమంత్రి పదవి... ఇది మోదీ హామీ' అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లారు. కేరళలో బీజేపీ గెలవడం ఇదే మొదటిసారి కాగా, గెలవగానే సురేశ్ గోపికి కేంద్రమంత్రి పదవి దక్కింది. సురేశ్ గోపి మలయాళ నటుడు. 250కి పైగా చిత్రాల్లో నటించారు. 2016 ఏప్రిల్ లో రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. 2019 లోక్ సభ ఎన్నికల్లో త్రిస్సూర్ నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో త్రిస్సూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఎంపీగా గెలిచి లోక్ సభలో అడుగుపెట్టనున్నారు.

## బీజేపీ ఏకపక్ష ధోరణితో వెళ్లడం కుదరదు

- మోదీపై పోటీ చేసిన కాంగ్రెస్ నేత అజయ్



**విశ్వంభర, వారణాసి:** టీడీపీ, జేడీయూ, ఇతర పార్టీలతో కలిసి ఈసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతోందని... కాబట్టి నరేంద్రమోదీ ప్రభుత్వం ఈసారి ఏకపక్ష ధోరణితో వ్యవహరించలేదని కాంగ్రెస్ పార్టీ నేత అజయ్ రాయ్ అన్నారు. ఆయన వారణాసిలో ప్రధాని మోదీపై పోటీ చేసి 1.52 లక్షల మెజార్టీతో ఓడిపోయారు.ఆదివారం అజయ్ రాయ్ మాట్లాడుతూ... గతంలో రెండుసార్లు బీజేపీకి స్పష్టమైన మెజార్టీ వచ్చిందని... కానీ ఈసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతోందన్నారు. ఇంతకుముందు కేంద్రంలోని బీజేపీ వ్యవహరించిన తీరు వేరని... వారి ఆలోచనలు వేరని... ఇప్పుడు ఇతర పార్టీల మద్దతు అవసరం కాబట్టి అలా వ్యవహరించడం సాధ్యపడదని అన్నారు. బీజేపీకి మద్దతిస్తున్న పార్టీలు భిన్నమైనవని... సిద్ధాంతాలు వేర్వేరుగా ఉంటాయన్నారు.



## కాలువలో బంగ్లా ఎంపీ శరీర భాగాలు గుర్తింపు

**విశ్వంభర, బంగ్లాదేశ్ :** బెంగాల్‌లో హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఆయన శరీర భాగాల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసిన అధికారులు తాజాగా వాటిని గుర్తించారు. ఓ కాలువలో మానవ ఎముకలను గుర్తించిన అధికారులు వాటిని ఫోరెన్సిక్ పరీక్షకు పంపనున్నారు.. ఈ కేసుకు సంబంధించి కీలక అనుమానితుడిని నేపాల్‌లో అరెస్టు చేసిన పోలీసులు.. భారత్‌కు తీసుకువచ్చారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు గాలింపు చేపట్టిగా.. బాధితుడిగా భావిస్తోన్న శరీర భాగాల ఎముకలు లభ్యమయ్యాయి. ''వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో గాలింపు జరపగా.. ఆ కాలువలో మనిషికి సంబంధించిన ఎముకలు లభ్యమయ్యాయి. వాటిని ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపిస్తాం. ఇతర శరీర భాగాల కోసం గాలింపు కొనసాగుతుంది'' అని పోలీసులు వెల్లడించారు. అంతకుముందు ఎంపీ శరీరానికి సంబంధించినగా భావిస్తోన్న దాదాపు మూడున్నర కిలోల మాంసపు ముద్దను హత్య జరిగిన అపార్టుమెంటు సెప్టిక్ ట్యాంకులోనే గుర్తించారు. మరోవైపు, ఈ హత్య కోసం ఎంపీ సన్నిహితుడే నిందితులకు దాదాపు రూ.5 కోట్లు చెల్లించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.



# నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి..

- ఐదేళ్ల పరిపాలన మనం చేయబోయేది ఇదే..
- శ్రద్ధతో పనిచేస్తేనే లక్ష్యాలను సాధిస్తాం
- 2047 కల్లా వికసిత్ భారత్ సాధ్యం చేయాలి
- కొత్త మంత్రులకు మోడీ సూచనలు
- నూతన కేబినెట్‌కు ప్రధాని తేనీటి విందు

**విశ్వంభర, ఢిల్లీ :** కేంద్ర కేబినెట్ మంత్రి పదవులు ఖరారు అయిపోయాయి. ఈసారి కొత్తవారికి ఎక్కువ పదవులు దక్కాయి. గతం కంటే మిత్రపక్షులకు ఈసారి మంత్రి పదవులు ఎక్కువ కేటాయించారు. ప్రమాణ స్వీకారానికి ముందు కొత్త మంత్రులతో ప్రధాని నరేంద్ర మోడీ తన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారికి తేనేటి విందు ఇచ్చారు. అనంతరం వారికి రాబోయే ఐదేళ్ల పరిపాలనపై పలు సూచనలు చేశారు. మంత్రులు తమకు కేటాయించిన శాఖల లక్ష్యాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యాలు ఏంటనేది వారికి చెప్పారు. ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వం పై నమ్మకంతో ఉన్నారని వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వంద రోజుల ప్రణాళికపై వారికి హితబోధ చేశారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. శ్రద్ధతో పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను సాధిస్తామన్నారు. ఇలా పని చేసుకుంటూ పోతే 2047 కల్లా వికసిత్ భారత్ సాధ్యమవుతుందని తెలిపారు. కొత్తగా మంత్రి పదవులు చేపట్టిన వారందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం మంత్రులందరూ మోడీతో ఫొటోలు దిగారు. అక్కడి నుంచి సాయంత్రం రాష్ట్రపతి భవన్ కు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలి వెళ్లారు.




## రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి మోడీ నివాళులు

**విశ్వంభర, ఢిల్లీ:** నరేంద్ర మోదీ ఇవాళ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ఇందుకు వేదికైంది. రాత్రి 7.15 గంటలకు మోడీ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ సందర్భంగా ఇవాళ(ఆదివారం) ఉదయం మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని వాజ్‌పేయికి మోడీ నివాళులర్పించారు. రాజ్‌ఘాట్, సదైవ్ అటల్‌కి వెళ్లి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రపతి భవన్ ప్రాంతంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు పొరుగు దేశాల అధినేతలు, విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే, మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజు, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫీఫ్, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, ప్రమాణ స్వీకారం తర్వాత మోడీ నేరుగా వారణాసి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



## కేంద్ర కేబినెట్‌లోకి తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు

- ఏపీ, తెలంగాణ నుంచి చెరిద్దరికి అవకాశం
- టీడీపీ నుంచి రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని
- తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్





**విశ్వంభర, ఢిల్లీ :** తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర కేబినెట్లో చోటు దక్కించుకున్న వారి పేర్లు కన్ఫామ్ అయ్యాయి. గత రెండు రోజులుగా ఈ విషయంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వీరికి వస్తుందంటూ వారికి వస్తుందంటూ పేర్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తాజాగా వారి పేర్లు అధికారికంగా వెల్లడయ్యాయి. కేంద్ర కేబినెట్ కూర్పుపై దాదాపు 9 గంటలుగా చర్చించారు ప్రధాని మోడీ. బీజేపీ అగ్రనేతలు జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఏపీ నుంచి టీడీపీ కోటాలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, మరో ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కు అవకాశం దక్కింది. ఇటు తెలంగాణ నుంచి సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డికి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవులు వరించాయి. ఈ కేంద్ర మంత్రి పదవులపై ఓ వర్కౌట్ ను అమలు చేశారు మోడీ. అయిదుగురు కంటే ఎక్కువ ఎంపీలు ఉన్న మిత్రపక్షాలకు ఒక కేంద్ర కేబినెట్ పదవి, ఒక సహాయ మంత్రి పదవి ఇవ్వాలని డిసైడ్ చేశారు. రెండు, మూడు ఎంపీ పదవులున్న మిత్ర పక్షాలకు ఒక సహాయ మంత్రి పదవి ఇవ్వనున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి అవకాశం దక్కింది.

**ఒకే కారులో వెళ్లిన కిషన్ రెడ్డి, బండి సంజయ్**

కేంద్ర కేబినెట్‌లో తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపీలకు చోటు దక్కింది. ఈ మేరకు పీఎంవో కార్యాలయం నుంచి బండి సంజయ్ కిషన్ రెడ్డిలకు ఫోన్స్ కాల్స్ వచ్చాయి. ఈ మేరకు కాసేపటి క్రితం కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఒకే కారులో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు బయల్దేరారు

## క్షమించండి.. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా




- బిజూ జనతా దళ్ నేత వీకే పాండియన్ కీలక నిర్ణయం
- సోషల్ మీడియాలో వీడియో ద్వారా వెల్లడి
- ప్రజల కోసం చాలా కష్టపడి పనిచేశా
- ఒడిశా ప్రజల ప్రేమ, ఆప్యాయత అతిపెద్ద సంపాదన అని ఆవేదన

**విశ్వంభర, ఒడిశా:** ఒడిశాలో బిజూ జనతా దళ్ కీలక నేత వీకే పాండియన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేడీ ఓటమికి బాధ్యత వహిస్తూ క్రియాశీలక రాజకీయాల నుంచి ఆయన తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ ప్రయాణంలో ఎవరినైనా బాధపెట్టి ఉండే తనను క్షమించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం వీకే పాండియన్ సోషల్ మీడియాలో ఒక వీడియోను షేర్ చేశారు. తనపై వ్యతిరేకంగా జరిగిన ప్రచారమే పార్టీ ఓటమికి కారణమైతే క్షమించాలని బీజేడీ కార్యకర్తల్ని పాండియన్ వేడుకున్నారు. ఒడిశా గడ్డపై అడుగు పెట్టిన తొలి రోజు నుంచే అపారమైన ప్రజల ప్రేమ, గౌరవం తనకు లభించాయని చెప్పారు. ప్రజల కోసం తాను చాలా కష్టపడి పని చేశానని, తనకున్న ఏకైక ఆస్తి తన పూర్వీకుల నుంచి సంక్రమించినదని వివరించారు. ఈ జీవిత కాలంలో తాను సంపాదించిన అతిపెద్ద సంపాదన ఒడిశా ప్రజల ప్రేమ, ఆప్యాయత వారి ఆదరాభిమానాలు మాత్రమే అని అన్నారు. అలాగే 12 ఏళ్ల కిందట ప్రభుత్వ అధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన తాను తన గురువైన నవీన్ పట్నాయక్‌కు సహాయం చేసేందుకే బీజేడీలో చేరినట్లు తెలిపారు. ఇదే తన ఏకైక ఉద్దేశమని, నిర్దిష్ట రాజకీయ పదవి లేదా అధికారం కోసం తనకు ఎలాంటి కోరిక లేదని చెప్పారు. ఒడిశాను ఎప్పుడూ తన హృదయంలో ఉంచుకుంటానని, గురువు నవీన్‌బాబును తన శ్వాసలో ఉంచుకుంటానని ఆవేదన చెందారు. ఒడిశా, నవీన్ పట్నాయక్ శ్రేయస్సు కోసం జగన్నాథుడిని ప్రార్థిస్తానని వీకే పాండియన్ అన్నారు.

## ఫొటోలు, వీడియోలు మాత్రమే సాక్ష్యం కాబోవు.. ఢిల్లీ హైకోర్టు

**విశ్వంభర, ఢిల్లీ:** సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ పెరిగిపోతోంది.. డీప్ ఫేక్ ఫొటోలే అసలైన ఫొటోలుగా చలామణి అవుతున్న రోజుల్లో ఫొటోలు, వీడియోలను సాక్ష్యాలుగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. కేవలం ఫొటోలు, వీడియోలు ఇస్తే సరిపోదు.. అవి నిజమైనవేననే ఆధారాలను కూడా ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈమేరకు ఓ జంట విడాకుల కేసులో ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీకి చెందిన ఓ జంటకు ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. భార్య, ఐదేళ్ల కూతురుకు కలిపి నెలనెలా రూ.75 వేలు భరణం కింద చెల్లించాలని భర్తను ఆదేశించింది. అయితే, తన భార్యకు వివాహేతర సంబంధం ఉంది కాబట్టి తాను ఎలాంటి మనోవర్తి చెల్లించాల్సిన అవసరంలేదని భర్త వాదించారు. ఫ్యామిలీ కోర్టు తీర్పును హైకోర్టులో సవాల్ చేశాడు. భార్య వివాహేతర సంబంధానికి సాక్ష్యంగా ఫొటోలను కోర్టుకు సమర్పించాడు. ఈ కేసును జస్టిస్ రాజీవ్ షక్దర్, జస్టిస్ అమిత్ బన్సల్ ల ధర్మాసనం విచారించింది.
భార్యకు వివాహేతర సంబంధం ఉందంటూ భర్త సమర్పించిన ఫొటోలు స్పష్టంగా లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. అంతేకాదు, డీప్ ఫేక్ ఫొటోల బెడద నేపథ్యంలో ఆ ఫొటోలను సాక్ష్యంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మరింత స్పష్టమైన ఫొటోలు, అవి నిజమైనవేననే ఆధారాలతో కోర్టుకు అందజేస్తే పరిశీలిస్తామని పేర్కొంది



## వామ్మో.. మహిళను మింగేసిన కొండచిలువ

**విశ్వంభర, ఇండోనేషియా:** అదృశ్యమైన ఓ వివాహిత కొండ చిలువకు ఆహారంగా మారింది. ఈ ఘటన ఇండోనేషియాలో తాజాగా వెలుగు చూసింది. దక్షిణ సులవేసీ ప్రావిన్స్‌లోని కాలేంపాంగ్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఫరీదా అనే 45 ఏళ్ల వివాహితకు నలుగురు పిల్లలు ఉన్నారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దీంతో ఆమె భర్త గ్రామస్థులు, పోలీసుల సాయంతో పరిసరాల్లో వెతికారు. ఈ క్రమంలో ఆమెకు సంబంధించిన వస్తువులు అడవిలో ఓ చోట కనిపించడంతో వారు అప్రమత్తమయ్యారు. ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టగా ఓ చోట 5 మీటర్ల పొడవున్న భారీ కొండ చిలువ కనిపించింది. దాని ఉదర భాగంతో ఉబ్బెత్తుగా ఉండటంతో అనుమానం వచ్చి దాని పొట్ట చీల్చి చూశారు. ఇంకేముంది అక్కడున్న వారి కళ్లు బైర్లుకమ్మాయి. అనుకున్నట్లుగా ఆ కొండచిలువ కడుపులో ఫరీదా ఉంది. మొదట ఆమె తలభాగం కనిపించింది. మహిళ ఒంటిపై దుస్తులు కూడా యథాతథంగా ఉన్నాయి. కొండచిలువకు ఆహారంగా మారిన తన ఫరీదాను చూసి ఆమె భర్త కన్నీటి పర్యంతమయ్యాడు.



## కల్పనా సోరెన్ వచ్చేశారు... జాగ్రత్త

**విశ్వంభర, ఝార్ఖండ్:** సీఎం చంపాయి సోరెన్ గారూ, జాగ్రత్తగా ఉండండి... కల్పనా సోరెన్ వచ్చేశారంటూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే ఝార్ఖండ్ ముఖ్యమంత్రిని హెచ్చరించారు. మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది జనవరిలో మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్ట్ అయ్యారు. అప్పుడు ఆయన రాజీనామా చేయడంతో సతీమణి కల్పన సోరెన్‌కు అవకాశం దక్కుతుందని భావించారు. కానీ పార్టీ సీనియర్ నేత చంపాయి సోరెన్ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఇటీవల గాండేయ్ అసెంబ్లీ స్థానానికి ఇటీవల ఉప ఎన్నిక జరిగింది. ఈ ఉప ఎన్నికలో హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ విజయం సాధించారు.ఈ క్రమంలో బీజేపీ ఎంపీ నిషికాంత్ ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ చేశారు. చంపాయి సోరెన్ జాగ్రత్తగా ఉండండి... కల్పనా సోరెన్ వచ్చేశారని ఆయన పేర్కొన్నారు. రానున్న వారం రోజులు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైనవి అన్నారు. తద్వారా, మరికొన్ని రోజుల్లో జేఎంఎం పార్టీలో అంతర్గత కలహాలు మొదలవుతాయని పరోక్షంగా అన్నారు.




## 'కశ్మీర్‌పై ఏకపక్ష చర్యలు అంగీకరించేది లేదు'

- చైనా, పాక్ సంయుక్త ప్రకటన

**విశ్వంభర, ఢిల్లీ:** దక్షిణాసియాలోని వివాదాస్పద అంశాల పరిష్కారంలో ఏకపక్ష చర్యలను అంగీకరించమని చైనా, పాకిస్థాన్ సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి. రెండు దేశాలు దక్షిణాసియాలో శాంతి, సుస్థిరతల స్థాపన ప్రాధాన్యాన్ని గమనంలో ఉంచుకుని వ్యవహరిస్తున్నాయని రెండు దేశాలు కలిసి శనివారం ఒక ప్రకటనను విడుదల చేశాయి. ఈ ప్రాంతంలోని కశ్మీర్ సహా అన్ని వివాదాస్పద అంశాల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో ఏకపక్ష చర్యలను అంగీకరించేది లేదని స్పష్టం చేశాయి. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాలుగు రోజుల చైనా పర్యటన ముగింపు సందర్భంగా ఈ ప్రకటన విడుదలైంది. జమ్ముకశ్మీర్‌లోని తాజా పరిస్థితులను గురించి చైనా నేతలకు పాకిస్థాన్ వివరించింది. ఐక్యరాజ్య సమితి చార్టర్ ప్రకారం కశ్మీర్ అంశాన్ని శాంతియుతంగా ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనుకున్న తమ సూచనను చైనా పునరుద్ఘాటించింది.

# పడి లేచిన అమరావతి

- బాబు రాకతో నగరంలో భూముల ధరలకు రెక్కలు
- నిర్మాణాల్లో మళ్లీ కదలిక.. స్థానికుల్లో ఎనలేని సంతోషం



**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలతో అమరావతి స్టేటస్సే మారిపోయింది. అక్కడ రియల్ ఎస్టేట్ మళ్లీ పుంజుకుంది. గుంటూరు జిల్లాలోని కృష్ణా నది ఒడ్డున నిర్మితమవుతున్న ఈ నగరం ఇప్పుడు హాట్ టాపిక్‌గా అయిపోయింది. జూన్ 4వ తేదీన వెలువడిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తెలుగు దేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టారు. 175 సీట్లలో ఏకంగా 164 సీట్లు రావడంతో మరోసారి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి అవుతున్న క్రమంలో అమరావతి నగరంలో రియల్ ఎస్టేట్ ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఫలితాలు వెలువడిన మూడు రోజుల్లోనే అక్కడి భూములు, ఇతర స్థిరాస్తుల ధరలు ఏకంగా 100 శాతానికిపైగా పెరగడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంది. అలాగే టీడీపీకి 16 లోక్ సభ స్థానాలు వచ్చాయి. దీంతో కేంద్ర రాజకీయాల్లో బీజేపీ నేతృత్వంలోని NDA భాగస్వామ్య పక్షాల్లో కీలకంగా టీడీపీ మారిపోయింది. మరోవైపు 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడం, సీఎం జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల అంశం తెరపైకి తేవడంతో అమరావతిలో రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా పడిపోయింది. టీడీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన అక్కడి వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలు ఆగిపోయి. ఐదేళ్ల పాటు పెట్టుబడులు రాలేదు. అయితే ఇప్పుడు టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో అమరావతికి పునరుజ్జీవం వచ్చినట్లయింది. చంద్రబాబు కలల ప్రాజెక్టు కావడంతో అక్కడి నిర్మాణాల్లో మళ్లీ కదలిక మొదలైంది. ప్రస్తుతం అమరావతి నగర సమీపంలో భూముల ధరలు 50 నుంచి 100 శాతం మేర పెరిగినట్లు సమాచారం. అలాగే గత వారంలో భూముల ధరలు రెండింతలయ్యాయి. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల్లో ధరలు 10- 20 శాతం మేర పెంచారు. ఏపీపై చంద్రబాబు నాయుడి దృష్టి కేవలం అమరావతిని కొత్త రాజధానిగా పేర్కొనడమే కాదు దాని స్థాయిని విస్తరించింది. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అభివృద్ధితో ఆ నగరాన్ని ఆధునిక ఐటీ హబ్‌గా మార్చాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బాబు మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్న సమయంలో రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపు తెచ్చింది.

## కేంద్ర కేబినెట్‌లోకి ఏపీ నుంచి ముగ్గురికి చోటు



**విశ్వంభర, విజయవాడ:** కేంద్ర కేబినెట్ లోకి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఐదుగురికి చోటు లభించనున్నట్లు తెలుస్తోంది. ఏపీ నుంచి కేంద్ర మంత్రిగా శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రిగా గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లకు అవకాశం దక్కనుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి, సహాయ మంత్రిగా బండి సంజయ్ కు కేంద్ర క్యాబినెట్ లో అవకాశం దక్కనుంది. ఇదిలాఉంటే.. ఏపీ బీజేపీ నుంచి శ్రీనివాస్ వర్మకు కూడా మోదీ క్యాబినెట్ లో చోటు లభించనున్నట్లు తెలుస్తోంది. పురందేశ్వరికి లోక్ సభ స్పీకర్ పదవి అప్పగించే అవకాశం ఉందని బీజేపీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. అదేవిధంగా మిత్రపక్షాల నుండి ప్రఫుల్ పటేల్, చిరాగ్ పాశ్వాన్, అనుప్రియ పటేల్, జయంత్ చౌదరి, జతిన్ రామ్ , కుమార స్వామి తదితరులు కేంద్ర మంత్రులుగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్న వారితో నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్న ఎంపీలతో మోదీ ఇవాళ మాట్లాడారు. హంగూ ఆర్భాటాలకు వెళ్లవద్దని సూచించారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. కేటాయించిన శాఖలపై పట్టు సాధించాలన్నారు. నాలుగు రోజుల పాటు శాఖలపై సమీక్షలు చేయాలని చెప్పారు. మిగిలిన మూడు రోజులు తమ తమ నియోజకవర్గాలకు కేటాయించాలని తెలిపారు. కాగా, మోదీ క్యాబినెట్ లోనూ మళ్లీ కొనసాగే కేంద్ర మంత్రులు ఎవరనే విషయంపై ఆసక్తి నెలకొంది. ఎస్.జైశంకర్ రెండోసారి విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వరుసగా మూడోసారి అదే శాఖలో కొనసాగనున్నారు. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, తదితరులు మళ్లీ క్యాబినెట్‌లో ఉండనున్నారు.

## జనసైనికులూ.. గొడవలొద్దు

- వారం రోజుల్లో పవన్ వస్తారు..
- పిఠాపురంలో టీడీపీ, జనసేన వర్గాల మధ్య పోరుపై స్పందించిన నాగబాబు



**విశ్వంభర, పిఠాపురం:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ విజయం సాధించిన పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. దీనికి తగినట్లుగానే అక్కడక్కడా రెండు పార్టీల కార్యకర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే పిఠాపురంలో జరుగుతున్న పరిణామాలపై జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు స్పందించారు. దీనిపై ప్రకటన విడుదల చేశారు.2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ బంపర్ మెజారిటీతో విజయం సాధించారు. టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ సహకారంతో వైసీపీ అభ్యర్థి వంగా గీత మీద పవన్ గ్రాండ్ విక్టరీ కొట్టారు. ఏకంగా 70 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. అయితే పవన్ కల్యాణ్ ఇంకా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయకముందే.. పిఠాపురంలో ఇరు పార్టీల మధ్య ఆధిపత్య పోరు మొదలైందంటూ వార్తలు వస్తున్నాయి. ఎస్వీఎస్ఎన్ వర్మ కారుపై కూడా జనసేన కార్యకర్తలు దాడి చేశారంటూ వీడియోలు వైరల్ అయ్యాయి. అక్కడక్కడా టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాగబాబు.. వీటిపై స్పందించారు. జనసైనికులు అందరూ సంయమనం పాటించాలని కోరారు. "వన్నెపూడిలో జరిగిన ఉదంతం పార్టీ దృష్టికి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నాం. పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరు తప్పు చేసినా ఊరుకునేది లేదు. తాటిపర్తి గ్రామంలో జరిగిన సంఘటన గురించి కూడా మాకు సమాచారం ఉంది. ఈ విషయంపై పిఠాపురం కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలోని స్థానిక నాయకులు చర్చించుకుని నిర్ణయం తీసుకుంటారు. అంటూ నాగబాబు ప్రకటన విడుదల చేశారు. "పవన్ కల్యాణ్ ఎన్డీఏలో కీలక భూమిక పోషిస్తున్న ఈ సమయంలో.. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో చక్కబెట్టాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయి. కేంద్రంలో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం, వారం రోజుల్లో పవన్ పిఠాపురం రానున్నారు. కో ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ పిఠాపురంలో అందరికీ అందుబాటులో ఉంటారు. పిఠాపురం ప్రజల సమస్యలు తీర్చడానికి అందుబాటులో ఉండే విధంగా పిఠాపురంలో జనసేన నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం " అని నాగబాబు ప్రకటనలో తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు పవన్ కల్యాణ్ ఉన్నారన్న నాగబాబు.. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుందామని తెలిపారు. తాను కూడా పిఠాపురంలో అందుబాటులో ఉంటానని.. సమస్యలు ఏవైనా ఉంటే అందరం కూర్చొని పరిష్కారం అయ్యే విధంగా ప్రణాళికలు రూపొందించుకుందామని చెప్పారు. పిఠాపురంలో సాగు, తాగు నీటి కొరతను అధిగమించాల్సిన అవసరం ఉన్నదనీ.. డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తామని తెలిపారు.

## వైఎస్సార్ విగ్రహాలపై అల్లరిమూకల వికృతదాడులు దారుణం

### ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

**విశ్వంభర, కడప:** ఏపీలో ఎన్నికల పోలింగ్ సమయంలో వైఎస్సార్ శ్రేణులు టీడీపీ నేతలపై దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో భారీ విజయాన్ని కైవసం చేసుకున్న కూటమి విజయానందంతో పాటు టీడీపీ నేతలపై దాడికి ప్రతిదాడులు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఈ తరుణంలో శనివారం కొందరు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ కండువాలు కప్పడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ తనయ, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఎక్స్ వేదికగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వైఎస్సార్ విగ్రహాలపై అల్లరిమూకలు చేస్తున్న వికృతదాడులను ఖండించారు. మహానేత విగ్రహంపై ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని పేర్కొన్నారు. ‘‘రాష్ట్రంలో మహానేత వైఎస్సార్ విగ్రహాలపై అల్లరి మూకలు చేస్తున్న వికృత దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచకాలు జరగడం అత్యంత దారుణం, మిక్కిలి శోచనీయం. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇలాంటి రౌడీ చర్యలు ఖండించి తీరాల్సిందే. ఇది పిరికి పందల చర్య తప్ప మరొకటి కాదు. తెలుగువారి గుండెల్లో గూడుకట్టుకున్న వైఎస్సార్ విశేష ప్రజాదరణ పొందిన నాయకులు. తెలుగు ప్రజల హృదయాల్లో ఆయనది చెరపలేని ఒక జ్ఞాపకం. అలాంటి నేతకు నీచ రాజకీయాలు ఆపాదించడం సరికాదు. గెలుపు ఓటములు ఆపాదించడం తగదు. వైఎస్సార్‌ను అవమానించేలా ఉన్న ఈ హీనమైన చర్యలకు బాధ్యులైన వారిపై వెనువెంటనే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.’’ అంటూ షర్మిల ట్వీట్ చేశారు.





## పది రోజుల్లోనే సీన్ మారి పోయింది: కాటసాని

**విశ్వంభర, పాణ్యం :** ఎన్నికల్లో ఘోర పరాజయం నుంచి వైసీపీ నేతలు ఇంకా కోలుకున్నట్టు లేదు. వారిని ఇప్పటికీ ఓటమి బాధ వేధిస్తూనే ఉంది. అంత దారుణంగా ఎలా ఓడిపోయామన్నది వారికి అర్థం కాని విషయంలా మారింది. అయితే, కొందరు మాజీ ఎమ్మెల్యేలు తమ ఓటమికి దారితీసిన అంశాలు ఇవేనంటూ మీడియా ముందుకు వస్తున్నారు. తాజాగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కూడా స్పందించారు. వైసీపీ ఓటమికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కూడా ఓ కారణమని విశ్లేషించారు. దీనిపై టీడీపీ చేసిన ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని, రైతుల భూములు లాగేసుకుంటారన్న ప్రచారం తమకు వ్యతిరేకంగా మారిందని కాటసాని అభిప్రాయపడ్డారు. కేవలం పది రోజుల్లోనే సీన్ మారిపోయిందని అన్నారు. ఇసుక పాలసీ కూడా వైసీపీకి నష్టం కలుగజేసిందని తెలిపారు. ముఖ్యంగా... జగన్, అధికారులు తమ మాట వినుంటే ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదని, ఎన్నికల్లో గెలిచేవాళ్లమని కాటసాని విచారం వ్యక్తం చేశారు.



## మోదీకి శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం జగన్


**విశ్వంభర, తాడేపల్లిగూడెం:** కేంద్రంలో ఎన్డీయే 3.0 ప్రభుత్వం కొలువుదీరింది. వరుసగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ప్ర మాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో మోదీపై శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా, ఏపీ మాజీ సీఎం జగన్ కూడా మోదీకి విషెస్ తెలియజేశారు. "వరుసగా మూడో పర్యాయం భారత ప్రధానమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోదీ గారికి నా హృదయపూర్వక శుభాభినందనలు" అంటూ ట్వీట్ చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నరేంద్ర మోదీతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించడం తెలిసిందే. మోదీతో పాటు మంత్రివర్గ సభ్యులు కూడా నేడు ప్రమాణం చేశారు.

## వైసీపీ సర్పంచ్ భర్త అనుమానాస్పద మృతి..

- కౌంటింగ్ రోజు మిస్సింగ్

**విశ్వంభర, నూజివీడు:** నూజివీడు మండలం తూర్పు దిగవల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామ వైఎస్ఆర్‌సీపీ సర్పంచ్ భర్త జగ్గవరపు వేణు గోపాల్ రెడ్డి అనుమానాస్పద మృతి చెందాడు. ఆయన మృతికి బెట్టింగ్ లే కారణంగా తెలుస్తోంది. సుమారు 30కోట్ల వరకు ఎన్నికల ఫలితాల బెట్టింగ్ లో వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు. ఎన్నికల ఫలితాల నుంచి గ్రామంలో కనిపించకుండా పోయాడు. దీంతో రెండు రోజుల క్రితం పందెం రాయుళ్లు వేణుగోపాల్ రెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఆదివారం గ్రామంలో మల్బరీ షెడ్ లో అనుమానాస్పద స్థితిలో వేణుగోపాల్ రెడ్డి శవమై కనిపించాడు. వేణుగోపాల్ రెడ్డి చనిపోవడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద స్థితిగా కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. అయితే, వేణుగోపాల్ రెడ్డి మరణానికి బెట్టింగ్ లే కారణమని స్థానికులు చెబుతున్నారు.

## అయ్యా కోవర్ట్ నానీ... అంటూ కేశినేని నానీపై బుద్ధా వెంకన్న ఫైర్



**విశ్వంభర, విజయవాడ:** ఎన్నికలకు ముందు వైసీపీ లో చేరిన కేశినేని నాని... సొంత తమ్ముడు కేశినేని శివనాథ్ (చిన్ని) చేతిలో ఓటమి పాలవడం తెలిసిం దే. కాగా, కేంద్ర మంత్రి వర్గంలోకి ఇద్దరు టీడీపీ ఎంపీలను తీసుకున్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడికి కేంద్ర మంత్రి పదవి, పెమ్మసాని చంద్ర శేఖర్ కు సహాయమంత్రి పదవి ఇచ్చారు. ఈ నేపథ్యంలో, కేశినేని నానీని ఉద్దేశిం చి టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "అయ్యా కోవర్ట్ నానీ... పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు చంద్రబాబు పిలిచి నీకు పార్టీ లోక్ సభ విప్ ఇస్తానంటే వద్దన్నావు. అది చాలా పెద్ద పదవి అని, దాని బాధ్యత తీసుకోలేనని తిరస్కరించావు. నువ్వు ఆ బాధ్యత తీసుకోలేవనే, నీది రతన్ టాటా రేంజి అని తెలిసే నిన్ను పక్కనబెట్టారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, అందుకే నిన్ను పక్కనబెట్టి నీ తమ్ముడి కేశినేని చిన్నిని విజయవాడ ఎంపీగా గెలిపించారు. పక్కనే ఉన్న గుంటూరు పార్లమెంటు స్థానంలో గెలిచిన పెమ్మసా ని చంద్రశేఖర్ ను కేంద్ర మంత్రివర్గంలోకి పంపించా రు. దీన్నిబట్టి అర్థమైంది ఏంటంటే... చెడపకురా చెడేవు" అంటూ బుద్దా వెంకన్న దెప్పి పొడిచారు.



## కేసరపల్లి సిద్ధం

- చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రెడీ
- 11 ఎకరాల్లో ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న ప్రధాని మోడీ

విశ్వంభర, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి కేసరపల్లి సిద్ధమవుతోంది. ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాట్లపై అధికార యంత్రాంగం ఫోకస్ పెట్టింది. 11 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు జెట్ స్పీడ్‌తో జరుగుతున్నాయి. ఐదుగరు ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో ఘనంగా ప్రమాణ స్వీకార ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదిక, సీటింగ్, భద్రత, పార్కింగ్ పై అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖులతోపాటుగా దాదాపు లక్ష మందికిపైగా ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నారు. 80 వేల మందికి సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

## చంద్రబాబు ప్రమాణ స్వీకార సమయంలో మార్పులేదు: టీడీపీ



**విశ్వంభర, తాడేపల్లిగూడెం:** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి సిద్ధమయ్యారు. ఈనెల 12వ తేదీ(బుధవారం) ఉదయం 11.27గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, సమయం మారిందని 9.27గంటలకే చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. ఏపీ సీఎంవో పేరుతో వచ్చిన ఆ ట్వీట్‌తో అంతా సమయం మారిందని అనుకున్నారు. ఈ నేపథ్యంలో అలాంటిదేం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎంవో చేసిన ట్వీట్‌లో తప్పిదం జరిగిందని వెల్లడించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఈనెల 12వ తేదీన ఉదయం 11.27గంటలకే జరుగుతుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా అమరావతిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే వేదికను గన్నవరానికి మార్చినట్లు ఏపీ సీఎంవో పేర్కొంది.



## రామోజీరావు సూచన ఎప్పటికీ మరువను..: నారా లోకేశ్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు అంత్యక్రియలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరయ్యారు. ఫిలింసిటీలోని రామోజీరావు నివాసం నుంచి స్మారక ప్రదేశం వరకు జరిగిన అంతిమయాత్రలో లోకేశ్ కూడా పాల్గొన్నారు. అక్షర యోధుడికి చివరి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, రామోజీరావు నాకు మార్గదర్శకులు అని తెలిపారు. రైతు కుటుంబం నుంచి అధికార పార్టీలను ప్రశ్నించే స్థాయికి వచ్చిన రామోజీరావుది ఓ చరిత్ర అని కొనియాడారు. "నా లాంటి యువతకు ఆయన స్ఫూర్తి ప్రదాత. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజల గొంతు వినిపించే తత్వం రామోజీరావుది. ఏ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధాన నిర్ణయాలు తీసుకున్నా రామోజీరావు సహించేవారు కాదు. ఏరంగంలో చేయి పెడితే ఆ రంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దారు. ప్రజలకు అండగా ఉండి సేవ చేస్తూ, వారి జీవితాల్లో మార్పు తీసుకురమ్మని రామోజీరావు నాకు నిత్యం ఇచ్చే సూచన ఎప్పటికీ మరువను. రామోజీరావు మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరం" అని వివరించారు



## అమరావతిలో సీఎస్ నీరబ్ కుమార్ పర్యటన

**విశ్వంభర, అమరావతి:** ఏపీలో కొత్త ప్రభుత్వం వస్తున్న నేపథ్యంలో, ఇటీవలే నూతన సీఎస్‌గా నియమితులైన నీరబ్ కుమార్ ప్రసాద్ నేడు అమరావతి రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ నెల 12న చంద్రబాబు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో, సీఎస్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాజధాని ప్రాంతంలో అసంపూర్తి నిర్మాణ పనులతో మధ్యలోనే ఆగిపోయిన వివిధ భవన నిర్మాణాలను సీఎస్ పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో గతంలో భూమి పూజ జరిగిన ఉద్దండరాయునిపాలెంలో సీఆర్డీయే ప్రాజెక్టు స్థలాన్ని కూడా సందర్శించారు.ఐఏఎస్, ఐపీఎస్ ల నివాస సముదాయాలు, ప్రజాప్రతినిధుల క్వార్టర్లు, ఎన్జీవోల నివాస భవనాలు, సముదాయాలను కూడా సీఎస్ నీరబ్ కుమార్ పరిశీలించారు. అనంతరం, హైకోర్టు అదనపు భవనాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఈ పర్యటనలో సీఎస్ తో పాటు సీఆర్డీయే కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీలో గుర్తింపునకు ఈ పదవే నిదర్శనం: ఎంపీ శ్రీనివాసవర్మ

**విశ్వంభర, విజయవాడ:** కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి ఇవాళ కేంద్ర మంత్రిగా ఎదిగిన నరసాపురం బీజేపీ ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ మీడియాతో మాట్లాడారు. కష్టపడి పనిచేసే వారికి బీజేపీలో గుర్తింపు లభిస్తుందనడానికి తనకు దక్కిన మంత్రి పదవే నిదర్శనమని అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో తనకు కూడా స్థానం లభించడం సంతోషం కలిగిస్తోందని తెలిపారు. బీజేపీలో ఓ కార్యకర్తగా తన ప్రస్థానం మొదలైందని, గత 34 ఏళ్లుగా పార్టీతో నడుస్తున్నానని శ్రీనివాసవర్మ వెల్లడించారు. నరసాపురం లోక్ సభ టికెట్ వచ్చినప్పుడు, కార్యకర్తలు గెలుపుపై తనకు భరోసా ఇచ్చారని తెలిపారు. తన విజయం కోసం బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు కృషి చేశారని, వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వివరించారు. తనకోసం రాయలసీమ నుంచి కూడా వచ్చి ప్రచారం చేశారని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ఇప్పటివరకు సహకరించి, ప్రోత్సహించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.




## ఎలాంటి ఆదాయాలపై ట్యాక్స్ ఉండదు..?

**విశ్వంభర, బిజినెస్ :** మనకు వచ్చే ప్రతి ఆదాయంపై ట్యాక్స్ చెల్లించాలని చాలామంది అనుకుంటుంటారు. కానీ కొన్ని ఆదాయాలపై ట్యాక్స్ ఉండదు. అందుకే ఇన్‌కంటాక్స్ నిబంధనల గురించి క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి. ఎలాంటి ఆదాయంపై ట్యాక్స్ ఉంటుంది, వేటిపై ట్యాక్స్ ఉండదనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం. కష్టపడి సంపాదించిన సంపాదనపై ట్యాక్స్ ఉండకూడదని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. ఎందుకంటే ట్యాక్స్ రూపంలో డబ్బులు పోగొట్టుకుంటే ఎవరికైనా నష్టమే అది. దీనికోసం వివిధ రకాల పద్ధతులు అవలంభిస్తుంటారు. అయితే కొన్ని రకాల ఆదాయ వనరులపై ట్యాక్స్ ఉండదు. వారసత్వంగా వచ్చిన సంపదపై ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. మీ తల్లి దండ్రుల్నించి మీకు వారసత్వంగా వచ్చిన ఆస్థి, నగలు, నగదుపై ఎలాంటి ట్యాక్స్ ఉండదు. మీ పేరుపై వీలునామా ఉన్నా సరే ట్యాక్స్ చెల్లించనవసరం లేదు. మీరు స్వయంగా సంపాదించే ఆదాయంపై మాత్రమే ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. వెడ్డింగు గిఫ్టులపై కూడా ట్యాక్స్ ఉండదనేది తెలుసుకోండి. అయితే ఆ వెడ్డింగ్ గిఫ్ట విలువ 50 వేలు దాటితే మాత్రం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఓ కంపెనీలో పార్టనర్ అయుండి మీ వాటా లేదా లాభం కింద డబ్బులు వస్తే దానిపై ట్యాక్స్ ఉండదు. ఎందుకంటే మీ పార్టనర్ షిప్ సంస్థ తరపున ట్యాక్స్ చెల్లించేసి ఉంటారు. మరోసారి చెల్లించాల్సిన అవసరం లేదు. అదే సంస్థ నుంచి మీరు జీతం తీసుకుంటుంటే మాత్రం దానిపై ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ క్లెయిమ్ లేదా మెచ్యూరిటీపై ఎలాంటి ట్యాక్స్ ఉండదు. అయితే వార్షిక ప్రీమియం అనేది మొత్తం డబ్బులో 10 శాతం మించకూడదు. లేకపోతే 15 శాతం ట్యాక్స్ ఉంటుంది. అదేవిధంగా ఈక్విటీ, మ్యూచ్యువల్ ఫండ్స్‌లో 1 లక్ష రూపాయల వరకూ రిటర్న్స్‌పై ఎలాంటి ట్యాక్స్ లేదు.



## పొగాకు, పాన్ మసాల ఉత్పత్తుల కంపెనీలకు ప్రత్యేక జీఎస్టీ ఫారం..!

**విశ్వంభర, బిజినెస్ :** పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తుల తయారీదారుల పన్ను ఎగవేతలను అరికట్టేందుకు జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) ప్రత్యేక ఫారం 'జీఎస్‌టీ ఎస్‌ఆర్‌ఎం–2'ను ప్రవేశ పెట్టింది.ఈ ఫారం ద్వారా కంపెనీలు సంబంధిత నెలకు సేకరించిన, వినియోగించిన ఇన్‌పుట్, అవుట్‌పుట్ వస్తు వివరాలను పన్ను అధికారులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు తమ యంత్రాలను రిజిస్టర్ చేసేందుకు జీఎస్‌టీఎన్ ఎస్‌ఆర్‌ఎం–1 ఫారాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది.

# ఉత్కంఠ పోరులో పాక్‌పై భారత్ విజయం

## 6 పరుగుల తేడాతో గెలిచిన ఇండియా

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచ్‌కప్ టోర్నీలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో భారత్ బౌలర్లు పాక్ బ్యాటర్ల దూకుడుకు కళ్లెం వేశారు. దాంతో భారత్ నిర్దేశించిన 120 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాక్ పోరాడి ఓడింది. పాకిస్థాన్ ఓపెనర్లలో మహ్మద్ రిజ్వాన్ (31) పరుగులు చేయగా, ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ బాబర్ ఆజం, ఉస్మాన్ ఖాన్, ఫఖర్ జమాన్ కేవలం వరుసగా 13 పరుగులకే పెవిలియన్ బాటపట్టేశారు.ఇమాద్ వసీం (15) పరుగులు చేయగా, షాదాబ్ ఖాన్ (4), ఇఫ్తికార్ అహ్మద్ (5) నిష్క్రమించగా, నషీం షా (10 నాటౌట్), షాహీన్ అఫ్రిది (0) అజేయంగా నిలిచారు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్థాన్ 7 వికెట్ల నష్టానికి 113 పరుగులకే పరాజయం పాలైంది. భారత బౌలర్లలో బుమ్రా 3 వికెట్లు, హార్దిక్ పాండ్యా 2 వికెట్లు తీయగా, అక్షర్ పటేల్, హర్షదీప్ సింగ్ తలో వికెట్ తీసుకున్నారు. ఈ టోర్నీలో టీమిండియాకు వరుసగా రెండో విజయం కాగా, పాకిస్థాన్ వరుసగా రెండోసారి ఓటమిపాలైంది.



### విఫలమైన భారత్ బ్యాటర్లు.. పాక్ టార్గెట్ 120

ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2024లో భాగంగా ఆదివారం ఇక్కడ న్యూయార్క్‌లోని నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన దాయాది పాకిస్థాన్ మొదట బౌలింగ్ ఎంచుకుని టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తొలుత బరిలోకి దిగిన టీమిండియా ఆదిలోనే తొలి వికెట్ కోల్పోయింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ (4) పరుగులకే ఔటయ్యాడు. ఆ తర్వాత మరో ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ (13) పరుగులకే చేతులెత్తేశాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ (42; 31 బంతుల్లో 6 ఫోర్లు) పర్వాలేదనిపించగా.. అక్షర్ పటేల్ (20) పరుగులకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత వచ్చిన భారత్ ఆటగాళ్లలో సూర్యకుమార్ యాద్ (7), శివం ధూబే (3), హర్దిక్ పాండ్యా (7), హర్షదీప్ సింగ్ (9) పేలవ ప్రదర్శనతో సింగిల్ డిజిట్‌కే పరిమితమై ఒకరి తర్వాత మరొకరు పెవిలియన్ బాటపట్టారు. జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా ఖాతానే తెరవలేదు. పాక్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడంతో కుప్పకూలిన టీమిండియా 19 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా దాయాది పాకిస్థాన్ జట్టుకు భారత్ 120 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. పాక్ బౌలర్లలో నసీమ్ షా, హరీస్ రవూఫ్ 3 వికెట్లు పడగొట్టగా, మహ్మద్ అమీర్ 2 వికెట్లు, షాహీన్ అఫ్రిది ఒక వికెట్ తీసుకున్నాడు.



**భారత జట్టు:** రోహిత్ శర్మ(కెప్టెన్), విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్(వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్



**పాకిస్థాన్ జట్టు:** మహ్మద్ రిజ్వాన్(వికెట్ కీపర్), బాబర్ అ జాం( కెప్టెన్) , ఉస్మాన్ ఖాన్, ఫఖర్ జమాన్, షాదాబ్ ఖాన్, ఇఫ్తికర్ అహ్మద్, ఇమాద్ వసీం, షాహీన్ అఫ్రిది, హారీస్ రవూఫ్, నసీమ్ షా, మహ్మద్ అమీర్

## కోహ్లి.. దాన్ని తగ్గించుకో..

### -కైఫ్ కీలక సూచన



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్‌లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. న్యూయార్క్‌లోని నాసౌ కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ ఆదివారం రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుంది. ఈ హైఓల్టేజ్ మ్యాచ్ చూసేందుకు ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం ఇరు జట్లకు కీలకమే కావడంతో మ్యాచ్ హోరాహోరీగా జరగనుంది.కాగా.. పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లికి పాకిస్తాన్ పై మంచి రికార్డు ఉంది. అయితే.. ఐర్లాండ్‌తో జరిగిన మొదటి మ్యాచులో కోహ్లి విఫలం అయ్యాడు. ఈ క్రమంలో కోహ్లికి టీమ్ఇండియా మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ ఓ కీలక సలహా ఇచ్చాడు. విరాట్ తన దూకుడును తగ్గించుకోవాలని సూచించాడు. తన స్ట్రైక్‌రేటును పట్టించుకోవద్దని చెప్పాడు. తన సహజ శైలిలోనే బ్యాటింగ్ చేయాలన్నాడు. కోహ్లి ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడని కైఫ్ చెప్పాడు. ఒక్కసారి అతడు క్రీజులో కుదురుకుంటే ప్రత్యర్థి ఆటగాళ్లు అతడిని ఔట్ చేయడం చాలా కష్టమన్నాడు. ఐపీఎల్‌లో అతడు అద్భుతంగా ఆడాడని, పవర్ ప్లేలో బౌండరీలు వర్షం కురిపించాడన్నారు. ఎలాంటి షాట్లనైనా అలవోకగా ఆడగలడన్నాడు. స్ట్రైక్‌రేటును అతడు పట్టించుకోవద్దన్నాడు. అతడు 130 స్ట్రైక్‌రేటుతో బ్యాటింగ్ చేస్తే భారత్‌కు మేలు జరుగుతుందన్నాడు. ఆఖరి ఓవర్లలో అతడు కీలకమని చెప్పాడు. డెత్ ఓవర్లలో కోహ్లి 60 నుంచి 70 పరుగులు చేయగలడన్నాడు. అతడు ఓపెనర్‌గా కాకుండా మూడో స్థానంలోనే ఆడిస్తేనే ఉపయోగం ఉంటుందని కైఫ్ అభిప్రాయపడ్డాడు

## ఇమ్రాన్ ఖాన్ ను విడుదల చేయండి...

### భారత్-పాక్ మ్యాచ్ జరుగుతున్న స్టేడియంపై బ్యానర్‌తో ఎగిరిన విమానం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** న్యూయార్క్ లోని నసావు కౌంటీ స్టేడియంలో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ జరుగుతోంది. మ్యాచ్ కొనసాగుతున్న సమయంలో ఓ విమానం స్టేడియంపై ఎగిరింది. ఆ విమానం ఓ బ్యానర్ ను ప్రదర్శిస్తూ వెళ్లింది. ఆ బ్యానర్ పై ఇమ్రాన్ ఖాన్ ను విడుదల చేయండి అని రాసి ఉంది. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. భారత్–పాక్ మ్యాచ్ పై ప్రపంచవ్యాప్త ఆసక్తి ఉంటుంది కాబట్టి, ఇలాంటి వేళ ఇమ్రాన్ ఖాన్ అంశాన్ని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లాలన్నది ఆ స్లోగన్ సృష్టికర్తల ఉద్దేశంగా కనిపిస్తోంది.

## గేమ్ ఛేంజర్ బుమ్రా అవుతాడు

- కోహ్లీ, రోహిత్ శర్మలు కాదు
- పాక్‌తో మ్యాచ్‌లో టీమిండియాకు బ్రహ్మాస్త్రం
- గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమిండియా మాజీ ఓపెనర్, కేకేఆర్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పాకిస్తాన్, టీమిండియా మ్యాచ్‌కు ఓ జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన 'ఈ ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్‌ఫార్మాట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా. నేను చాలా ఏళ్ల క్రితమే ఈ విషయం చెప్పాను. మనం చాలా మంది భారత బ్యాటర్ల గురించి తరుచూ మాట్లాడుకుంటాం. కానీ వారి కంటే ఎక్కువ గుర్తింపు, ప్రశంసలు జస్ప్రీత్ బుమ్రాకు దక్కాలి. కానీ దురదృష్టవశాత్తు బుమ్రాకు ఆ గుర్తింపు దక్కలేదు. ప్రతీ ఫార్మాట్‌లో టీమిండియాకు అతనే ఎక్స్ ఫ్యాక్టర్. ఎలాంటి కండిషన్స్‌లోనైనా.. ఎంత పెద్ద టోర్నీలోనైనా బుమ్రా సత్తా చాటుతాడు. ఏ జట్టుకు ప్రాతినిథ్యం వహించినా.. ఏ ఫార్మాట్ ఆడినా అతనే ఎక్స్ ఫ్యాక్టర్ అవుతాడు. అతను గేమ్ ఛేంజర్. ప్రస్తుత తరంలో అతనే అత్యుత్తమ పేసర్. అతనిలాంటి బౌలర్ ఉండటం టీమిండియా చేసుకున్న అదృష్టం. చాలా మంది బుమ్రా వినూత్న యాక్షన్ వల్లే అతను అత్యుత్తమ పేసర్ అయ్యాడని చెబుతారు. కానీ నేను మాత్రం అతని ఆలోచన విధానం, బౌలింగ్‌పై ఉన్న నియంత్రణే కారణం అంటాను. అతని సక్సెస్ కు యాక్షన్ ఒక కారణం కావచ్చు. అలాగే బౌలింగ్‌పై అతనికి ఉన్న కంట్రోల్ కూడా మరో కారణం. ఎంతటి విభిన్నమైన యాక్షన్ ఉన్నా బౌలింగ్‌పై నియంత్రణ లేకుంటే అనుకున్న విధంగా బౌలింగ్ చేయలేరు. ఏ బౌలర్ అయినా రాణించాలంటే అతనికి సరైన ఎగ్జిక్యూషన్‌తో పాటు ప్రణాళిక, ఆలోచన విధానం, పరిస్థితులకు తగ్గట్లు బౌలింగ్ చేసే సామర్థ్యం ఉండాలి. అప్పుడే అనుకున్న రీతిలో బంతిని సంధించగలడు. ఇవన్నీ బుమ్రాలో ఉన్నాయి. ప్రస్తుతం బుమ్రానే వరల్డ్ బెస్ట్ పేసర్' అని గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు.

## పవిత్ర హజ్ యాత్రకు బయల్దేరిన సానియా మీర్జా

- కొన్నాళ్ల కిందట పాక్ క్రికెటర్ షోయబ్ మాలిక్ ను పెళ్లాడిన సానియా
- సానియా, షోయబ్ లకు ఓ కుమారుడు
- కొంతకాలం నుంచి విడిగా ఉంటున్న సానియా
- మెరుగైన వ్యక్తిగా తిరిగొస్తానని వెల్లడి



**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత టెన్నిస్ రారాణి సానియా మీర్జా వైవాహిక జీవితం విచ్ఛిన్నం కావడం తెలిసిందే. కొన్నేళ్ల కిందట పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ ను పెళ్లాడి న సానియా... కొంతకాలంగా భ ర్త నుంచి వేరుగా ఉంటోంది. ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో ఓ చానల్ కు కామెంటేటర్ గా వ్యవహరించిన సానియా... తాజాగా కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర హజ్ యాత్రకు బయల్దేరారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తెలియజేశారు. హజ్ యాత్రకు వెళ్లే దివ్యమైన అవకాశాన్ని ఆ భగవంతుడు తనకు అందించాడని సానియా వెల్లడించారు. తన జీవిత పరివర్తన అనుభూతికి సిద్ధమవుతున్నానని, ఆధ్యాత్మిక భావనలతో తన హృద యం నిండిపోయిందని తెలిపారు. అందుకు కృతజ్ఞురాలినని పేర్కొన్నారు. తాను ఏవైనా తప్పిదాలకు, పొరపాట్లకు పాల్పడి ఉంటే మనస్ఫూర్తిగా క్షమించాలని కోరుతున్నట్టు సాని యా వివరించారు. అల్లా నా ప్రార్థనలను ఆలకిస్తాడని నమ్ముతున్నానని, నన్ను సన్మార్గంలో తీసుకెళతాడన్న నమ్మకంతో ప్రార్థిస్తున్నానని పేర్కొన్నా రు. జీవితకాలంలో ఎంతో పవిత్రమైనదిగా భావించే హజ్ యాత్రకు వెళుతున్న సందర్భం గా నా గురించి ప్రార్థించండి అని కోరారు. హజ్ నుంచి స్వచ్ఛమైన హృదయం తో, బలమై న విశ్వాసంతో ఓ మంచి వ్యక్తిగా తిరిగివస్తానని సానియా వివరించారు.



# దుమ్ములేపిన 'ఓజీ' ఓటీటీ రైట్స్..

విశ్వంభర, సినిమా: ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఘనవిజయం సాధించారు. పిఠాపురం నుంచి ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా మరో 20 మంది ఎమ్మెల్యేలను కూడా గెలిపించుకున్నారు. అలాగే రెండు ఎంపీ స్థానాలను కూడా కైవసం చేసుకున్నారు. ఇలా 100 శాతం స్ట్రైక్ రేట్ తో సంచలన విజయం సాధించిన పవన్ కల్యాణ్ పేరు ఇప్పుడు దేశ వ్యాప్తంగా మార్మోగిపోతోంది. స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పవన్ ను 'తుపాన్ ' అంటూ ప్రశంసించారు కాగా. ఎన్నికల్లో పవన్ భారీ విజయం సాధించడంతో ఆయన సినిమాలకు కూడా డిమాండ్ పెరిగింది. పవర్ స్టార్ సినిమాలు అనుకున్న దానికంటే రెట్టింపు ధరకు అమ్ముడు పోతున్నాయి. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం 'ఓజి', 'హరిహర వీర మల్లు', 'ఉస్తాద్ గబ్బర్ సింగ్' చిత్రాల్లో నటిస్తున్నారు ఈ సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అయితే అంతకు ముందే పవన్ సినిమాలు రికార్డులు బద్దలు కొడుతున్నాయి. ఈ సినిమా హక్కులు భారీ మొత్తాలకు అమ్ముడుపోతున్నాయి. తాజాగా పవన్ ఓజీ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఇందుకోసం ఏకంగా 92 కోట్ల రూపాయలు చెల్లించిన ట్లు సమాచారం. సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ కాకముందే డిజిటల్ రైట్స్ ఇంత భారీ మొత్తానికి అమ్ముడు పోవడం విశేషం.





# ఎన్‌బీకే 109 నుంచి ఫైరింగ్ అప్‌డేట్..

**విశ్వంభర, సినిమా:** అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి చిత్రాలతో వరుసగా మూడు బ్లాక్ బాస్టర్ హిట్లు కొట్టారు నందమూరి నటసింహం బాలకృష్ణ. ప్రస్తుతం ఆయన ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. బాబీ డియోల్ దర్శకత్వంలో ఓ మూవీలో నటిస్తున్నారు. బాలయ్య కెరీర్‌లో 109వ చిత్రంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్స్ పై నాగవంశీ, సౌజన్య ఈ మూవీని నిర్మిస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ మూవీ నుంచి వచ్చిన గ్లింప్స్ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు మరో సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. బాలయ్య పుట్టిన రోజు (జూన్ 10న) సందర్భంగా సాలిడ్ అప్‌డేట్‌ను ఇవ్వనున్నారు. దీనిపై సంగీత దర్శకుడు థమన్ శనివారం రాత్రే ఫైరింగ్ ట్వీట్ ఇవ్వనున్నట్లు ట్వీట్ చేయగా.. ఆదివారం దర్శకుడు బాబీ ఇదే తరహాలో పోస్ట్ చేశాడు. దీంతో బాలయ్య అభిమానులు ఫుల్ ఖుషీగా ఉన్నారు. చిత్ర బృందం ఇచ్చే అప్‌డేట్ ఏంటా అని అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఎన్టీఆర్‌కు జతగా ఆలియా భట్

విశ్వంభర, సినిమా: గ్లోబల్ స్టార్, మ్యాన్ ఆఫ్ మాసెస్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఓవైపు పాన్ ఇండియా చిత్రం దేవరతో బిజీగా ఉన్న తారక్ మరోవైపు తన బాలీవుడ్ డెబ్యూ మూవీ వార్-2తో కూడా బిజీగా ఉన్నారు. బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ ప్రధాన పాత్రలో వస్తున్న ఈ చిత్రంలో తారక్ నెగిటివ్ రోల్‌లో కనిపిస్తారని సమాచారం. అయాన్ ముఖర్జీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా షూటింగ్ ముంబయిలో జరుగుతోంది. రీసెంట్ గా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదేంటంటే? ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ కథానాయికగా నటించబోతున్నట్లు సమాచారం. జులై చివరి వారంలో అలియా భట్ ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించనుందని టాక్. బ్రహ్మాస్త్ర ఫేమ్ అయాన్ ముఖర్జీ ఈ సినిమా దర్శకత్వం వహిస్తుండడంతో అలియా ఈ మూవీ ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ భారీ మల్టీస్టారర్ 2025 ఆగస్టు 14న విడుదల కానుంది.

# ఆశ ఆమెతోనే మొదలు..

**'కల్కి 2898AD' నుంచి కొత్త పోస్టర్..**

**విశ్వంభర, సినిమా:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రం కల్కి 2898AD. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషనల్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. ఈ చిత్రంలో స్పెషల్ క్యారెక్టర్ అయిన బుజ్జి అనే కారును దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో తిప్పుతూ సినిమాపై బజ్‌ను క్రియేట్ చేస్తున్నారు. ఇక మూవీ ట్రైలర్‌ను జూన్ 10న విడుదల చేయనున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు ట్రైలర్ విడుదల కానుంది. కాగా.. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఆశ ఆమెతో మొదలవుతుంది అంటూ దీనికి క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో దీపిక పదుకొనె ఎవరికోసమే ఎదురు చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. మొత్తంగా ఈ పోస్టర్ వైరల్‌గా మారింది. కల్కి 2898AD చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్ లో అశ్వినీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రభాస్ భైరవగా, అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా కనిపించనుండగా ప్రతినాయకుడి పాత్రను లోక నాయకుడు కమల్ హాసన్ పోషించారు. దీపికా పదుకోన్, దిశా పటానిలు కీలక పాత్రల్లో నటించారు.





# దయ్యంగా మృణాల్ ఠాకూర్.. నో చెప్పిన లారెన్స్

విశ్వంభర, సినిమా: ప్రముఖ కొరియోగ్రాఫర్, హీరో, డైరెక్టర్ రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ కాంచన. ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఆతరువాత వచ్చిన కాంచన 2, కాంచన 3 ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాజాగా కాంచన 4ను తెరకెక్కించనున్నట్లు చిత్ర బృందం తెలియజేసింది. ఈ మూవీకి కూడా రాఘవ లారెన్స్ దర్శకత్వం వహిస్తాడని తెలిపింది. ఈ మూవీ షూటింగ్ సెప్టెంబర్‌లో మొదలు పెట్టనున్నట్లు వెల్లడించారు. అయితే.. ఈ సినిమాలో ఎవరెవరు నటించనున్నారు అన్న విషయాలు మాత్రం చెప్పలేదు. ఇక ఈ చిత్రంలో సీతారామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ నటిస్తున్నట్లు గత రెండు రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఆమెతో పాటు మరికొందరు ఈ మూవీలో యాక్ట్ చేస్తున్నట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై రాఘవ లారెన్స్ స్పందించాడు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదన్నాడు. అలాంటి వాటిని నమ్మొద్దన్నాడు. కాంచన 4లో నటించే నటీనటుల వివరాలను రాఘవేంద్ర ప్రొడక్షన్ ద్వారా అధికారికంగా వెల్లడిస్తామన్నారు. త్వరలోనే వివరాలు తెలియజేస్తామని లారెన్స్ ట్వీట్ చేశాడు.



# ఈ ఆకులో పాలలో కంటే మూడు రెట్లు ఎక్కువ కాల్షియం



ప్రోటీన్... ప్రోటీన్.. ఈ మధ్య చాలా మంది నుంచి ఇదే మాట వింటున్నాం. జిమ్‌కు వెళ్లే వాళ్లు అయితే ప్రోటీన్ మీద ఎక్కువ శ్రద్ధ పెడతారు. ప్రోటీన్ పౌడర్, ప్రోటీన్ మిల్క్ షేక్ ఇలా బాడీకి ప్రోటీన్ ఏదో ఒక విధంగా అందించే ప్రయత్నం చేస్తుంటారు. ప్రోటీన్ శరీరానికి చాలా అవసరం. కానీ మీరు ఏ రకమైన ప్రోటీన్ తీసుకుంటున్నారు అనేది చాలా ముఖ్యం. ప్లాంట్ బేస్డ్ ప్రోటీన్ ఆరోగ్యానికి మంచిది. అందులో మునగ ఆకుల నెంబర్‌వన్.

- విశ్వంభర, ఫీచర్

మోరింగాను "ప్రకృతి యొక్క మల్టీవిటమిన్" అని పిలుస్తారు, దీనిని పాలకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చు. " ఇది చాలా పోషక మైనది, దాని చెట్టును అద్భుత చెట్టు అని పిలుస్తారు. ఇందులో పాల కంటే 2 నుండి 3 రెట్లు ఎక్కువ కాల్షియం ఉంటుంది కాబట్టి. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సైన్స్ నిపుణుడు మరియు డిగా ఆర్గానిక్స్ వ్యవస్థాపకుడు అలోక్ సింగ్ ఇలా అన్నారు, "మొరింగ ఆకులలో విటమిన్లు A, C మరియు E పుష్కలంగా ఉన్నాయి మరియు అవి కాల్షియం, పొటాషియం మరియు ఇనుము వంటి ఖనిజాలను గణనీయమైన మొత్తంలో అందిస్తాయి." పాలు కాల్షియం మరియు మాంసకృత్తుల యొక్క అద్భుతమైన మూలం అయితే, మొక్క ఆధారిత ఐరన్, యాంటీఆక్సిడెంట్లు మరియు విటమిన్‌లను పాలలో లభించే పరిమాణాలను మించి అందించడంలో మొరింగ రాణిస్తుందని ఆయన వివరించారు. మొరింగలో అవసరమైన అమైనో ఆమ్లాలు కూడా ఉన్నాయి. ఇది బలమైన మొక్కల ఆధారిత ప్రోటీన్ మూలంగా మారుతుంది. పాలును మోరింగతో భర్తీ చేయడం వల్ల ఆహార కొవ్వులు మరియు ప్రోటీన్ల తీసుకోవడం తగ్గుతుంది. ఇతర ఆహారప దార్థాలతో సరిపడా పరిహారం ఇవ్వకపోతే పాలు అందజేస్తాయి" అని సింగ్ నొక్కిచెప్పారు.

మొరింగలో అధిక ఫైబర్ కంటెంట్, ప్రయోజన కరంగా ఉన్నప్పటికీ, పెద్ద మొత్తంలో తీసుకుంటే జీర్ణ అసౌకర్యాన్ని కూడా కలిగిస్తుంది. ఇది ప్రతి ఒక్కరికీ రుచికరంగా ఉండకపోవచ్చు. లాక్టోస్ ఎలర్జీ ఉన్న వ్యక్తులకు లేదా శాకాహారి ఆహారాన్ని అనుసరించే వారికి, మొరింగ ఆహారంలో ప్రయోజనకరమైన అదనంగా ఉంటుంది, మొక్కల ఆధారిత మూలాల నుండి మాత్రమే పొందడం తరచుగా సవాలుగా ఉండే కీలక పోషకాలను అందిస్తుంది. మొరింగలో పోషకాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, సహజంగా పాలలో ఉండే విటమిన్ బి12 లేదా డి అధిక స్థాయిలో ఉండవు.




# కలవర పెడుతున్న ఫ్యాటీ లివర్ వ్యాధి

**దేశంలో పెరిగిపోతున్న కొవ్వు కాలేయం**

**అతిగా మద్యం తీసుకోవడం**

**ఫైలు తినడం, సరైన ఆహారం తీసుకోకపోవడం..**

**ప్రధాన కారణాలుగా పేర్కొంటున్న వైద్యులు**



**విశ్వంభర, ఫీచర్ :** ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే ఫ్యాటీ లివర్ వ్యాధి నానాటికి పెరుగుతోంది. వాస్తవానికి ఫ్యాటీ లివర్ (కొవ్వు కాలేయం) సమస్య ఊబకాయం, సరైన ఆహారం తినకపోవడం, ఫైలు తినడం, మద్యం అతిగా తాగడం వల్ల వస్తుంది.. ఫ్యాటీ లివర్ సమస్యను రెండుగా విభ జిస్తారు. . ఆల్కాహాలిక్ (AFLD), నాన్ ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ (NAFLD)గా పేర్కొంటారు. అతిగా మద్యం తాగడం వల్ల కాలేయం దెబ్బతింటుంది. ఆల్కహాల్-సంబంధిత కాలేయ వ్యాధి ప్రారంభ దశ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (AFLD). అతిగా చెక్కర తీసుకోవడం ఊబకాయం వల్ల నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ పెరుగుతోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తుంది. జన్యుశాస్త్రం.. జీవనశైలి ఒక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఈ పరిస్థితి వెనుక ఉన్న ప్రధాన కారణాలలో చక్కెర ఒకటి. షుగర్ -NAFLD మధ్య సంబంధం ఏమిటో ఇప్పుడు తెలుసుకోండి.. నాన్ ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ (NAFLD) అనేది తక్కువ ఆల్కహాల్ లేదా మద్యపానం లేని వ్యక్తుల కాలేయంలో అదనపు కొవ్వు పేరుకు పోయే పరిస్థితి. ఇవి సాధారణ కొవ్వు కాలేయం (స్టీటోసిస్) నుండి నాన్-ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ (NASH) వరకు ఉంటాయి. ఇది సిర్రోసిస్, కాలేయ క్యాన్సర్‌తో సహా తీవ్రమైన కాలేయ నష్టానికి దారితీస్తుంది. NAFLD కేసుల పెరుగుదల ఊబకాయం, జీవక్రియ సిండ్రోమ్‌లో పెరుగుదలను ప్రతిబింబిస్తుంది. ఇది ఆహారాన్ని ముఖ్యమైన అంశంగా సూచిస్తుంది.

**ఆహారంలో చక్కెర పాత్ర ఏమిటి?**

అనేక ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర పానీయాలలో చక్కెర కనిపిస్తుంది. శరీరంలోని వివిధ కణజాలాల ద్వారా జీవక్రియ చేయబడిన గ్లూకోజ్ వలె కాకుండా, ఫ్రక్టోజ్ ప్రధానంగా కాలేయంలో ప్రాసెస్ అవుతుంది. చక్కెర కాలేయ ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడానికి జీవక్రియలో ఈ వ్యత్యాసం ముఖ్యమైనది.

**ఫ్రక్టోజ్ – కాలేయ జీవక్రియ**

మనం ఫ్రక్టోజ్‌ని తీసుకున్నప్పుడు, అది కాలేయానికి రవాణా అవుతుంది. ఇక్కడ డినోవో లిపోజెనిసిస్ అనే ప్రక్రియ ద్వారా కొవ్వుగా మార్పు చెందుతుంది. ఈ ప్రక్రియ కాలేయంలో కొవ్వు పేరుకు పోవడానికి దోహ ద ం చేస్తుంది. ఇది NAFLD ముఖ్య లక్షణం. అధిక ఫ్రక్టోజ్ ఆహారాలు కాలేయ వాపు, ఇన్సులిన్ నిరోధకతను పెంచుతాయి. ఇది కాలేయ నష్టాన్ని మరింత పెంచుతుంది. అనేక అధ్యయనాలు చక్కెర తీసుకోవడం, NAFLD మధ్య అనుబంధాన్ని పరిశీలించాయి. జర్నల్ ఆఫ్ హెపటాలజీలో ప్రచురించబడిన ఒక ముఖ్యమైన అధ్యయనంలో NAFLD (నాన్ ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్) ఉన్న వ్యక్తులు వ్యాధి లేని వ్యక్తుల కంటే ఎక్కువ ఫ్రక్టోజ్‌ను ఎక్కువగా తీసుకుంటారని కనుగొన్నారు. అధిక ఫ్రక్టోజ్ తీసుకోవడం వల్ల కొవ్వు పదార్థం పెరగడం, కాలేయంలో మంట ఏర్పడుతుందని అధ్యయనం హైలైట్ చేసింది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లోని మరొక అధ్యయనంలో చక్కెర తీసుకోవడం తగ్గించడం, ముఖ్యంగా ఫ్రక్టోజ్, కాలేయ కొవ్వులో గణనీయమైన తగ్గింపు, కాలేయ పనితీరు మెరుగుదలకు దారితీస్తుందని నిరూపించింది. చక్కెర తీసుకోవడం తగ్గించిన పాల్గొనేవారు ఇన్సులిన్ సెన్సిటివిటీలో మెరుగుదలలు, కాలేయ వాపు తగ్గింపులను చూశారు.

**చక్కెర పానీయాల ప్రభావం ఏమిటి?**

సోడా –పండ్ల రసం వంటి చక్కెర పానీయాలు ఫ్రక్టోజ్ ప్రధాన వనరులు. ఈ పానీయాల రెగ్యులర్ వినియోగం NAFLD అభివృద్ధి, పురోగతితో ముడిపడి ఉంది. జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీలో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం.. చక్కెర పానీయాలు తక్కువగా తాగే వారి కంటే ఎక్కువ మొత్తంలో చక్కెర పానీయాలు తీసుకునే వ్యక్తులు NAFLD అధిక ప్రాబల్యాన్ని కలిగి ఉన్నారు.